
# మరో బహుమతి

(ఆంగ్ల రాజ్య కథ)

కె. సదాశివ రావు





అయిదు నిముషాల్లో రాయల్ మెయిల్ ఢిల్లీ స్టేషన్ చేరుకోబోతోంది. టెరెన్స్ ఫోస్టర్ తన ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ కిటికీలో నుండి బయటకు చూస్తున్నవాడు ఓసారి తన సామాన్లని చెక్ చేసుకున్నాడు.

డఫెల్ బాగ్, లెదర్ సూట్‌కేస్, హోల్డాల్ అన్నీ కట్టేసి నీట్‌గా పెట్టి వున్నాయి. జేబులో నుండి ఓ నలిగిన కవర్ తీశాడు. అందులో రోజ్ రంగు కాగితం మీద గుండ్రటి అక్షరాలతో వున్న అందమైన ఉత్తరం వుంది. అది ఎన్నో మార్లు చదివిన దానిలా నలిగిపోయి వుంది. కాగితం నుండి లవెండర్ సువాసనలు వెదజల్లుతున్నాయి.

లండన్
3-3-1922

డార్లింగ్ టెర్రీ,

నీకు ఈ ఉత్తరం చేరేనాటికి నేను కెంట్‌లో స్కూలులో చేరిపోయి వుంటాను. జీతం బాగానే వుంటుంది. జిమ్‌నీ, ఎంజెలానీ ఇక్కడే వుండి చదివిస్తాను. ఆ బాధ్యత నాకు ఎలాగూ తప్పదు.

నేను నిన్ను గురించి తలచుకోని క్షణం వుండదు టెర్రీ ... టెర్రీ ... ఐ లవ్ యూ.



నాకున్న బాధ్యతల వల్ల నేను నీతో జీవితాన్ని పంచుకోలేకపోవడం నాకు నరకప్రాయం అయినా తప్పదు. మనం కొన్నేళ్ళు ఆగడంలో నష్టమేముంది? వీళ్ళిద్దరూ పెరిగి కాలేజీలలో చేరడానికి మరో ఆరేడేళ్ళు పడుతుంది. అప్పటివరకూ మన మధ్య వియోగం తప్పదనుకుంటాను.

ABSENCE MAKES THE HEART GROW FONDER అంటే నీవు నమ్ముతావా టెర్రీ డార్లింగ్? నేను పూర్తిగా నమ్ముతాను. ఇది మన నిజమైన ప్రేమకి పరీక్ష. సహనానికి టెస్ట్ ఇందులో మనం నెగ్గుతామన్న నమ్మకం నాకుంది. ఆంట్ జెస్సీ నాతో పోరుతోంది. మరో వరుణ్ణి చూచి పెళ్ళి చేసుకొమ్మని. ఆమెకి ఇండియా అంటే మంట. ఆమె భర్త ఆ దేశంలో కలరాతో చనిపోయాడు.

ఇక్కడ వాతావరణం నీకు తెలియనిదేముంది? అక్కడ ఎలా వుంది టెర్రీ? నీ ఉద్యోగం చాలా ఇంటరెస్టింగ్‌గా వుండి వుండాలి. బుర్రా బాబువి మరి!

నీ ప్రక్కన నిలబడి నీతో ఆ దేశపు సోషల్ లైఫ్ పంచుకోవడానికి నా మనసు ఆవేశపడుతుంది. కాని ఎలా? నా పైన వున్న బాధ్యతలు నన్ను కట్టిపడేసి వుంచాయి.


ఇంతకీ నీవు ఇంగ్లండ్ ఎప్పుడు వస్తున్నావు? నిన్ను చూడాలని నీ కంఠం వినాలనీ అహర్నిశలూ తహతహలాడే.

నీ

మేరియన్

తాజా కలం: ఐ లవ్ యూ ... ఐ లవ్ యూ .... ఐ లవ్ యూ.





## ఇసీజి

తెరలోపల
ఒక చీకటి చిరాకుగా పచార్లు చేస్తుంది
తెర వెలుపల
ఒక మౌనం మృత శిశువును ప్రసవిస్తుంది
ఒక తెర
రెండుగా చీలి వెచ్చగా ముదుచుకుంటుంది
పరుచుకున్న దృశ్యం
జారుతున్న వాన చినుకు వెంట పడి మరణిస్తుంది
ఒకోసారి పాట
చూరుకు వేళాడే ఎర్ర దీపంలా ఊగుతుంది
ఊయలలో పాప
ఏడుపును జోకొడుతుంటుంది
ఒకోసారి అందరూ
కాకెంగిలి ముక్కలే అవుతారు
అయిష్టంగానే తినేయాలి
ఒకోసారి
పద్యాలు చీమల్లా క్యూ కడతాయి
పాతుకుపోయినట్టే నడిచిపోతాయి
ఒకోసారి
ఓ స్పర్శ దేహంతో కళ్ళు తుడుస్తుంది
ఒకోసారి
ఓ హామీ తోలు వలిచి నిజాల్ని నిలబెడుతుంది
కన్నీటి చినుకు నెలతప్పుతుంది
నడక ఆగిపోయినా
రోడ్లన్నీ వెళ్ళిపోతూనే వుంటాయి

— ప్రసేన్

తియ్యని బాధ అతడిని ఆవరించింది. ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకునేసరికి ఢిల్లీ స్టేషన్‌లో ట్రెయిన్ ఆగబోతున్నది.

బండి దిగి సామాన్లు దింపుకుని చుట్టూ చూశాడు.

వసంత ఋతువులో మరో రోజు. ఢిల్లీలో ఇవి ఎంతో ఆహ్లాదకరమైన రోజులు.

తన చిరకాల మిత్రుడు, బాచ్‌మేట్ ఇన్ సర్వీస్ హోల్డెన్ స్టాఫర్ట్ కోసం ఫ్లాట్‌ఫారమంతా తేరిపార చూశాడు. ఎక్కడా అతడు కనిపించలేదు.

ఢిల్లీ స్టేషన్ బిజీగా వుంది. రకరకాల భాషలు ... హిందీ ... ఉర్దూ ... పంజాబీ ... సింధీ... దక్షిణాది భాషలు ఇంకా ఎన్నో డయలెక్ట్స్ ... కలగా పులగంగా వినిపిస్తున్నాయి. మినీ టవర్ ఆఫ్ బేబెల్ లా ...

స్టేషన్‌లో కూలీలు ఎర్రరంగు తలపాగాలతో చెమటతో తడిసిన కుర్తాలతో పెరిగిన గడ్డాలతో వుండి పెద్ద పెద్ద పెట్టెలను, ఇతర లగేజీనీ మోసుకుని తీసుకుపోతున్నారు. బయట ఎన్నో టాంగాలూ, ఓ కొద్ది కారులూ వున్నాయి. టాంగా వాలాలు పాసెంజర్స్‌ని తమ బళ్ళలోనికి రమ్మని అర్థిస్తూ అరుస్తున్నారు. బేరాలు జరుగుతున్నాయి. సర్దార్జీలు జోకులేస్తూ, సరదాగా కబుర్లు చెబుతూ ప్రయాణీకులని నవ్విస్తూ తమ బళ్ళకి గిరాకీ పెంచుకుంటున్నారు.

"సాహెబ్ కూలీ" అన్నాడు పోర్టర్ ఆశగా.

"నహీ" అన్నాడు ఫోస్టర్. తన సామాన్లు తనే మోసుకోవడం అతడికిష్టం. ఏమంత బరువు లేవు. పైగా హోల్డాల్ వస్తే అనవసరం తగాదా.

ఫ్లాట్ ఫారమ్ మీద నిలబడ్డ ఫోస్టర్ ఇదీ ఇండియా అనుకున్నాడు. శబ్దాలతో నిండిన ... రంగురంగుల ... దట్టమైన ధూళి మిళితమైన ... వేడివేడిగా వుండి ... అగోచరంగా ఏ విశ్లేషణకీ అందని నిగూఢతతో వుండే దేశం ఇది.

టైమ్ చూసుకున్నాడు.

ఏడున్నర అయింది.

అసహనంతో చుట్టూ చూశాడు. ఆనాడు ట్రెయిన్ ఎంతో ఆశ్చర్యకరంగా కరెక్ట్ టైమ్‌కే ఢిల్లీ చేరుకుంది. దాదాపు నమ్మరాని మిరకిల్ ఇది.

ఇక్కడ కాలానికి విలువ లేదు.

### పోయినవాళ్ళు

"పోయిన వాళ్ళంతా మంచివాళ్ళేనం టారా?" రామారావు అడిగాడు రంగారావుని.

"పరీక్ష పోయిన వాళ్ళు మాత్రం కాదు" చెప్పాడు రంగారావు.

— పి.ఆర్. బద్దిగం

అవసరమూ లేదు.

స్టేషన్ బయట నెడ్ లుట్యెన్స్, బేకర్ ఢిల్లీ ... కాదు ... న్యూఢిల్లీ నగరాన్ని కదుతున్నారు. ఇంపీరియల్ స్టెండర్‌కి ఈ నగరం పతాక సన్నివేశం కావాలని వారి ఆకాంక్ష. ఆంగ్ల రాజ్య ఔన్నత్యానికి ఈ నగరం క్లైమాక్స్ కావాలి. అదీ వారి ప్లాన్.

కాని ఢిల్లీ నగరపు శక్తి వారికి తెలియదు.

ఢిల్లీ నగరం ఈ దేశపు మానసిక, చారిత్రక జాతీయ రాజధాని.

ఇక్కడ నేల పొరల్లో చరిత్ర కలసిపోయి వుంది. ఎన్నో జాతుల సంస్కృతీ శకలాలు మిళితమైన భూమి భాగమిది. ఈ భూమి పొరల్లో నెత్తుటి వరదల తడి వుంది. ఆక్రోశాల ప్రతిధ్వని వుంది. ఇన్వేడర్స్ గుర్రపు డెక్కల శబ్దాలు ఈ నగర వీధుల్లో మారుమ్రోగుతూనే వుంటాయి. ఓరియంటల్ వైభవానికి ఇది మచ్చుతునక. వైభవానికీ ... ప్రాముఖ్యతకీ ... శోభకీ ... పాడుపడిన గోడలతో ... నగరం నిండా సమాధులు ... కూలిపోబోతున్న ప్రాసాదాలు ... నగరం శిథిలాలు ... వీటి మీద కట్టబడుతున్న నూతన భవన సముదాయాలు. ఇది ఎడతెగని గమనం. ఇవన్నీ ఇక్కడ పుట్టి పెరిగి నశించిన సామ్రాజ్యాలకి చిహ్నాలు.

ఇక్కడ కాలం స్తంభించిపోయింది.

విజేతలూ ... ఓడిపోయిన వాళ్ళూ.

ప్రక్కప్రక్కనే ఖననమై వుంటారు.

ఈ నగరం హృదయ రహితమైన ప్రభుత్వ సంస్కృతికి పరాకాష్ఠ. ప్రాణం లేని బూడిద రంగు ప్రపంచం ... నంగిరి మాటలూ ... దొంగ మర్యాదలూ ... ఎత్తులూ పై ఎత్తులూ ... వెన్నుపోటులూ విద్రోహాలూ ... జీవ రహితమైన శుష్క ఆచారాలూ... పద్ధతులూ ఇక్కడి సంస్కృతిలోని ముఖ్య భాగాలు.

ఢిల్లీ నగరంలో చరిత్ర నివసిస్తుందంటారు. ప్రాచీనం ... మధ్య యుగం ... ఆధునికం ... ప్రక్క ప్రక్కనే.

ఈ నగరం అసలు పేరు ఢిల్లిక. మెహ్రౌలీ దగ్గర వోనాడు వుండిన మధ్యయుగపు పట్టణం. మహాభారతంలోని పాండవులు యమునా నదీ తీరంలో కట్టిన ఇంద్రప్రస్థం ఇక్కడే వుండేదని వో నమ్మకం. నిరంతరం జరుగుతుండే మానవ ప్రయత్నాలని వమ్ముచేస్తూ అంతులేని మానవాశయాలని హేళన చేస్తూ, వారి బలహీనతలని క్షమిస్తూ ... వారిని తనలో కలిపేసుకుంటూ . .. కాలాన్నీ ... లోకాన్నీ ... చరిత్రనీ ... అధిగమిస్తూ ... ఈ మహానగరం నిర్లిప్తంగా జీవిస్తుంది.

ఎన్నో మహోన్నతమైన సంస్థలూ... వంశాలూ

ఇక్కడ మట్టి కరిచిపోయాయి. ఈ నగరం పాలకుల మనసు మీద బలమైన ప్రభావం చూపిస్తుంది. దానికి కారణం. ఈ నగరపు చరిత్రలో కలిసి వున్న రొమాన్స్ ... మిస్టరీ ... అజ్ఞాత శక్తి ...

ఇక్కడి శిథిలాలని చూస్తే గుండె అవిసిపోతుంది. వేదాంత భావాలు మనసుని ముంచి కదిల్చి వేస్తాయి.

ఢిల్లీని ఆసియా ఖండపు రోమ్ అంటారు కొందరు చరిత్రకారులు. మరి కొందరు ట్రాయ్ అంటారు.

కారొనేషన్ దర్బార్ సందర్భంగా ఇండియాకి వచ్చిన కింగ్ జార్జ్ V 1911లో న్యూఢిల్లీ నగరానికి శంకుస్థాపన చేశాడు. నగరం కట్టడం ఇంకా పూర్తి కాలేదు. ఆ బాధ్యతని తను భుజాల మీద వేసుకున్న వాస్తుశిల్పులిద్దరూ పట్టుదలతో పోటీగా పనిచేస్తూ ఈ నగరానికి రూపుదిద్దుతున్నారు.

(కాని వారికి ఓ రహస్యం తెలియదు. ఈ నగరం నిర్మాణం ఆంగ్ల సామ్రాజ్యానికి హంసగీతం పాడుతుందనీ, ఇక్కడ ప్రారంభమైన పతనం ఖండ ఖండాల్లో ప్రతిధ్వనించి ఆంగ్లరాజ్యంలో రవి ఉదయించకుండా పోతుందనీ, ఇంగ్లండ్‌లో పొగ మంచుతో, వర్షంతో, స్లీట్‌తో నిండిన రోజులతో సంపూర్ణ సూర్యదర్శనపు రోజులు అపురూపంగా వారికి తోస్తాయనీ ... వాతావరణం గురించి మాట్లాడటం వారి సంభాషణా చతురతకి తార్కాణమవుతుందనీ ... 'వాటె లవ్లీ డే' అనుకుంటూ ఆనందంతో మురిసిపోతారనీ వారికి తెలియదు.)

అలవాటు చొప్పన హోల్డెన్ రావడం లేట్. కొంపదీసి తన రాక గురించి మరిచిపోయాడా! తను రాసిన ఉత్తరం అందలేదా? ఏది ఏమైనా మరో పది పదిహేను నిముషాలు వెయిట్ చేయడంలో నష్టమేమీ లేదు. ఒకవేళ రాకపోతే కన్నాట్ సర్కస్ దగ్గర్లోనే వున్న హోల్డెన్ ఇల్లు పట్టుకోవాలి.

కదలుతున్న రంగురంగుల మానవ సముద్రాన్ని చూస్తున్నాడు ఫోస్టర్. కమిలిన రాగి రంగు చర్మాలూ... రకరకాల బట్టలూ ... మూటలూ ... మందమైన ఇండియన్ వాసనలు ... స్పైసెస్ ... పుగాకు ... చెమట... మట్టి వాసన.

ఇది వేడీ ... దుమ్మూ కలిసే దేశం.

ఇది రోగాలూ ... చావులూ ముమ్మరంగా వుండే దేశం.

ఇక్కడ గర్భదారిద్ర్యం ... ఐశ్వర్యం ... గుడిసెలూ ... పెద్ద పెద్ద పాలెస్‌లూ, దివాణాలూ ప్రక్కప్రక్కనే వుంటాయి. అనూహ్యమైన వ్యత్యాసాలు అద్భుతమైన బాలెన్స్‌తో సహజీవనం చేస్తుంటాయి.

ఈ కాంబినేషన్‌లు అంత తేలిగ్గా మారవు.

ఈ ఇండియా!

"మీ ఇండియా" ఫోస్టర్‌కి గుర్తొచ్చింది. యూని



వర్శిటీలో ప్రొఫెసర్ ఆర్నాల్డ్ అన్న మాటలు.

"చేరిన రోజు నుండీ సర్వీస్ నుండి రిటైర్ అయ్యేవరకూ అది మీ ఇండియా అందరూ గుర్తుంచుకోండి."

ప్రొబేషనర్స్ అందరికీ బోధ ఇది.

వేర్ ది హెల్ ఈజ్ హోల్డెన్?

హోల్డెన్ ది ప్లేబోయ్!

ఎవరైనా డిప్లొమాట్ కుమార్తెని వల్లో వేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడా! ఎవరైనా డ్యూక్ మేనగోడల్ని లేక అమెరికా నుండి వచ్చిన మిలియనీర్ వారసురాల్ని లేక ఢిల్లీ ఇంగ్లీష్ సర్కిల్స్‌లో వుండే ఎంతోమంది అందమైన యువతుల్లో ఆశలు రేకెత్తించి వారితో ఆడుకుంటున్నాడా. సీజన్‌తో ఎందరో అందమైన పెళ్ళి కాని ఆడపిల్లలు ఇంగ్లండ్ నుండి షిప్‌లలో ఇండియాకి వచ్చి దిగుతారు. ఎవరో వొకర్ని షాపరోన్‌గా తెచ్చుకుని సీజన్‌లో వుండే కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఆ సందర్భంగా ఎలిజిబుల్ బ్రహ్మచారి కుర్రాళ్ళని కలిసి పరిచయం చేసుకోవడం ... ఆ అవకాశాలు కలిగించడం. ఈ కార్యక్రమంలోని అంతర్గతంగా వుండే ముఖ్యోద్దేశం.

బాల్స్, గేమ్స్, పార్టీలు, డిన్నర్స్, ఫాన్సీ డ్రెస్ బాల్స్, థియాట్రికల్స్, మ్యూజికల్ ఈవెనింగ్స్, ఫేట్స్... ఎన్నో ప్రోగ్రామ్స్ ..., ఈ సందర్భాలలో పెండ్లికాని ఇంగ్లీష్ ఆడపిల్లలు ఇండియన్ గవర్నమెంట్ సర్వీస్‌లో చేరి మంచి భవిష్యత్ వున్న కుర్రబ్రహ్మచారులను కలుసుకుని ప్రేమలో పడే ప్రయత్నాలు చేస్తారు. సివిలియన్, మిలిటరీ, పొలిటికల్ సర్కిల్స్‌లో పైకి రాగల ... ముందు ముందు సెక్రెటరీలు, జనరల్స్, రాయబారులు, గవర్నర్స్, వైస్రాయిలు కాగల సామర్థ్యం వున్న వాళ్ళు చురుకుదనం వున్న స్మార్ట్ యంగ్‌మెన్‌ను వెదకడం ఈ సీజన్లలో జరిగే తతంగం.

సీజన్లలో ఇంగ్లండ్ నుండి భర్తల వేటలో ఇండియా వచ్చే ఆడపిల్లలని "ఫిషింగ్ ఫ్లీట్" లేక చేపల వేటకి వచ్చిన ఆడపిల్లలు అనేవారు. తగిన వరుడు దొరకక తిరిగి ఇంగ్లండ్ వెళ్ళిపోయేవారిని "రిటర్న్‌డ్ ఎంప్టీస్" లేక "తిరిగి వెళ్ళిన ఖాళీ పడవలు" అనేవారు. ప్రభుత్వ సర్వీస్‌లో వున్న భర్త లభించకపోతే చాలామంది ప్రాక్టికల్ గర్ల్స్ నిలకడగా వుండి ఎంతో డబ్బు సంపాదించే వ్యాపారస్తుడైన భర్తలని చూసుకునేవారు. వీళ్ళని బాక్స్ వాలాలు అనేవారు.

ఢిల్లీలో వున్న ఎలిజిబుల్ బాచెలర్స్‌లో హోల్డెన్ స్టాఫర్డ్ నంబర్ వన్. మంచి ఉద్యోగం. గుడ్ బాక్‌గ్రౌండ్. భవిష్యత్ వున్న యువకుడు.

ఫోస్టర్ నిట్టూర్చాడు.

హోల్డెన్ ది లేట్!

హోల్డెన్ కమ్ లేట్‌లీ!

పాప్యులర్ బాచెలర్ ఆఫ్ ఢిల్లీ

ది రేక్! ది బా ...

"హల్లో ఫోస్టర్"

తిట్ల మధ్యలో ఫోస్టర్ ఆగిపోయాడు. తన ముందు నిలబడి వున్నది మహారాజా విక్రమ్‌సింగ్ ఆఫ్ దిశాపూర్.

గత మూడేళ్ళుగా ఫోస్టర్ దిశాపూర్ సంస్థానంలో పొలిటికల్ ఏజంట్‌గా పనిచేశాడు. ఆ జాబ్‌లో మహారాజాకి సలహాదారుగా, పరిపాలనలో ముఖ్యమైన నిర్ణయాలకి బాధ్యుడైన అధికారిగా ఓ విధంగా ఆప్తమిత్రుడిలా వ్యవహరించవలసి వుంది. మూడేళ్ళ తర్వాత ఫోస్టర్‌కి అక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ అయింది.

మహారాజా యువకుడు. అతడు కూడా ఇంగ్లండ్‌లో చదువుకున్న వాడే. వెయ్యేళ్ళకి మించిన చరిత్ర గల సంస్థానానికి రాజతడు. ఎత్తుగా కొనదేరిన అక్విలైన్ ముక్కుతో హాండ్సమ్‌గా వున్నాడు. చాలా గేమ్స్‌లో ప్రావీణ్యం వున్న వాడు. జెంటిల్‌మన్.

టెరెన్స్ ఫోస్టర్‌కి ఆ సంస్థానంలో పనిచేయడం వల్ల మంచి అనుభవం వచ్చింది. సంతృప్తి మిగిలింది.

"గుడ్ మార్నింగ్ యువర్ హైనెస్"

ఫోస్టర్ నవ్వుతో తలవంచి బౌ చేసి అన్నాడు.

"ఎవరి కోసమన్నా ఎదురు చూస్తున్నావా మిస్టర్ ఫోస్టర్?"

"అవును యువర్ హైనెస్. నా మిత్రులు రావాలి" అంటూంటే మళ్ళీ చూశాడు.

దిస్ హోల్డెన్ ఈజ్ ఇన్‌కారిజిబుల్!!

ఇంపాసిబుల్!

"ఐసీ అయితే ఢిల్లీలో ఈ రోజు నీ కార్యక్రమమేమిటి ఫోస్టర్?"

"ఇంగ్లండ్‌కి నా ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవాలి. వైస్రాయి అపాయింట్‌మెంట్ ఇస్తే కాల్

ఆన్ చేయాలి. ఇతర సీనియర్ అధికారులను కలిసి మాట్లాడాలి. కొద్ది రోజులు ఫ్రెండ్స్‌తో గడపాలి. ఇంకా ఏముంటుంది. యువర్ హైనెస్?"

చిరునవ్వుతో అన్నాడు ఫోస్టర్.

మహారాజా వెనక రాయల్ కంపార్ట్‌మెంట్ ... ప్యాలెస్ ఆన్ వీల్స్ వుంది. దానిలో నుండి నౌకర్లు లగేజ్ దింపుతున్నారు.

దిశాపూర్ నుండి ఢిల్లీకి ప్రయాణం ఓ రాత్రి పడుతుంది. కాస్త ముందుగా డిన్నర్ తిని ఫోస్టర్ తన ఫస్ట్‌క్లాస్ పెట్టెలో నిద్రపోయాడు. మహారాజా కంపార్ట్‌మెంట్ ఎప్పుడు జాయిన్ చేసిందీ అతడికి తెలియదు.

"చివరి క్షణంలో తీసుకున్న నిర్ణయం ఇది ఫోస్టర్"

"మీరు ఇక్కడ కొద్ది రోజులు వుంటారా యువర్ హైనెస్?"

"హెవెన్స్ నో! నాకు వేరే పనులున్నాయి. ఇక్కడ వొక రోజు వుండి రేపు సిమ్లా వెళ్ళాలి. అక్కడ సీజన్ చివరి రోజులు కదా?"

ఓ యస్ సిమ్లా సీజన్ పూర్తవడానికి కొద్ది రోజులే వున్నాయి.

హిల్ స్టేషన్లు లేకుండా వుంటే ఇండియాలో పనిచేసిన విదేశీయుల గతి ఏమిటో వూహించడం చాలా కష్టం. చరిత్ర వేరే విధంగా వుండేదని చరిత్రకారుల అభిప్రాయం. ఈ దేశ శీతోష్ణత తీవ్రతకీ, రోగాలకీ తట్టుకోలేక ఆంగ్లేయులూ, ఇతర విదేశీయులూ తమ దేశాలకి వెళ్ళిపోయి వుండేవారు. బ్రిటిష్ ఎంపైర్‌ని పటిష్ఠపరచడంలో హిల్ స్టేషన్ల పాత్ర ముఖ్యమైనది. ముస్సూరీ మౌంట్ అబూ, సిమ్లా, మనాలీ, నైనీటాల్, ఉదకమండలం, డార్జిలింగ్, కాశ్మీర్ ...

"నేను కారులో డ్రాప్ చేస్తాను ఫోస్టర్."

"థాంక్యూ యువర్ హైనెస్. మీకు శ్రమ ఇవ్వడం నాకు ఇష్టం లేదు. నా మిత్రుడు మరో కొద్ది నిముషాల్లో తప్పక వస్తాడు. నేను లేకపోతే మళ్ళీ అనవసరపు కంగారు. నేను వెయిట్ చేస్తాను తమరు వెళ్ళిరండి."

గౌరవపూర్వకంగా బౌ చేశాడు.

మహారాజా చిరునవ్వు నవ్వి కరచాలనం చేసి వెళ్ళిపోయాడు. రాజ పరివారం అతడి వెనక చిన్న వూరేగింపులా వెళ్ళింది.

డామ్ యూ హోల్డెన్!


కోపంతో పిడికిళ్ళు బిగించి వాటి టెన్షన్ తగ్గించడానికి కోటు జేబులో చేయి పెట్టాడు. అక్కడో కవర్ తగిలింది. బయటకు తీశాడు.

బాగా నలిగి శిథిలమై పోతున్న కవర్ అది.

ఆక్స్‌ఫర్డ్ ముద్ర వుంది.

ఆ ఉత్తరం ప్రొఫెసర్ రిచర్డ్‌సన్ రాసినది.

మై డియర్ ఫోస్టర్,




ఎలా వున్నావు మై బోయ్? నీ ఉద్యోగం ఎలా వుంది. బాగా ఎంజాయ్ చేస్తున్నావనుకుంటాను.

నీ టాలెంట్ వృథా అవుతున్నదని నా దృఢ నమ్మకం. నీవు చరిత్రలో కృషిచేస్తే ఎంతో మంచి భవిష్యత్తు వుంటుందని నాతో పాటు ఇతర ప్రొఫెసర్లకి కూడా నమ్మకం. ఏమయితేనేం నీవు ఇండియా వెళ్ళిపోయావు. అది నీ నిర్ణయం మేము చెప్పేది ఏమీ లేదు.

కాని నీకు ఏనాడైనా తిరిగి ఆక్స్‌ఫర్డ్‌కి వచ్చి స్టడీ చేయాలనే ఆలోచన వస్తే నీ కోసం ఉద్యోగం, స్కాలర్‌షిప్ అన్నీ సిద్ధంగా వుంటాయి. ఇండియాలో నీకు లభించే లగ్జరీలు మేము ఇవ్వలేమని నీకు తెలుసు.

టైము దొరకితే జవాబు రాయి.

నీ అభ్యున్నతిని ఎల్లప్పుడు కోరే
ప్రొఫెసర్ ఆల్బర్ట్ రిచర్డ్‌సన్

ఫోస్టర్ కళ్ళు చెమ్మగిల్లాయి. తనని స్వంత కొడుకులా చూసుకునే ప్రొఫెసర్ రిచర్డ్‌సన్. అతడి భార్య ఎడిత్. తన మీద వారికున్న నమ్మకం, వాత్సల్యం అతడికి గుర్తు కొచ్చినప్పుడల్లా కదల్చివేస్తాయి.

ప్రొఫెసర్‌కి ఉత్తరం రాయాలి. ఇప్పటికే లేటయింది. దాదాపు అరవైయేళ్ళు వున్న ప్రొఫెసర్ ఆరోగ్యం అంతంత మాత్రమే. ఆయన ఎంత అమాయకుడు! సర్వీస్ వదిలి ఆక్స్‌ఫర్డ్ వచ్చేస్తానని ఎలా అనుకుంటాడు? How naive! కవర్ జేబులో పెట్టుకున్నాడు.

"హల్లో టెర్రీ"

ఉలిక్కిపడ్డాడు ఫోస్టర్.

హోల్డెన్ వచ్చాడు. ఎదురుగా వున్నాడు. ముఖంలో మిస్చీఫ్, కొంటెతనం ... కళ్ళల్లో ఇంటెలిజెన్స్ వున్నాయి.

ఫోస్టర్ నవ్వాడు.

"వచ్చావా హోల్డెన్? మరో అయిదు నిముషాల్లో నీవు రాకపోతే ఓ టాంగా చూసుకుని వెళదామనుకుంటున్నాను. నా ఉత్తరం అందలేదా నీకు?"

"ఉత్తరం అందింది. ఈ బ్లడీ ట్రెయిన్ కరెక్ట్ టైమ్‌కే వస్తుందని నేను కలగన్నానా? ఆలస్యానికి క్షమించు. వొకవేళ నీవు టాంగాలో బయల్దేరినట్లయితే ఈ ఢిల్లీలో నన్ను పట్టుకోవడానికి నీ తరమయ్యేది కాదు. అయినా లేట్ చేసి క్షమించమనడం నాకు అలవాటు. నీకు మామూలే కదా? ప్లీజ్ టెర్రీ ఎక్స్యూజ్‌మీ ... ఆల్‌రైట్?"

ఫోస్టర్ నిట్టూర్చాడు.

"ఆల్‌రైట్ హోల్డెన్ పదపోదాం."

సామాన్లతో ఇద్దరూ బయటికి నడుస్తూ "నాకెందుకు ఆలస్యమయిందో నీవు అడగనే లేదు టెర్రీ .. చెప్పమంటావా?"

"నో ప్లీజ్ డోంట్! ఆలస్యానికి తోడు ఓ పెద్ద కథ చెప్పి నన్ను విసిగించకు. నీకు పొరపాటు. నాకు అలవాటు. అంతే కదా" అని నవ్వాడు ఫోస్టర్..

"ఓ పిల్ల వచ్చింది టెర్రీ. బ్రిస్టల్‌లో ఆమె మేనమామ మేయర్. రెడ్ హెడ్. వెరీ టాల్ గర్ల్. రాత్రి ఓ పార్టీకి వెళ్ళాం. బాగా లేటయింది. లిలియన్‌కి లేటెస్ట్ డాన్సెస్ అన్నీ తెలుసు. ఫాంటాస్టిక్ గర్ల్. మళ్ళీ రేపు డిన్నర్ డేట్ వుంది."

చెప్పకుంటూ పోతున్నాడు హోల్డెన్.

జనం బాగా పలుచబడిపోయారు.

బయట ఓ నల్లటి టూ సీటర్ కారు వుంది.

అందులో సామాన్లు వేసుకుని బయల్దేరారు.

"టెర్రీ వైస్రాయితో నీ అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయింది. రేపు సాయంత్రం నాలుగున్నర గంటలకి వైస్రాయి లాడ్జిలో టీకి రమ్మని సెక్రటరీ నుండి ఆహ్వానం కూడా అందింది.

"థాంక్యూ ... ముందు స్నానం చేసి బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేశాక కబుర్లు ... ఆపైన మిగిలిన ప్రోగ్రామ్స్. న్యూఢిల్లీ ఎలా వుంది?

"కట్టడం జరుగుతోంది. నీవు చూస్తావుగా"

"రేపటి నుండీ ఉదయం పోలో ... మధ్యాహ్నం క్లబ్‌లో లంచ్ ... సాయంత్రం టెన్నిస్ ... రాత్రి పార్టీలు ... నీకు ఏ మాత్రం బోర్ అనిపించకుండా చూస్తాను. మన బాచ్‌మేట్స్ డార్సీ, రెగ్గీ, ఆస్టీ, స్టీవెన్ లాంబెర్ట్ ... శామీ ఫోర్ట్ ఇంకా చాలామంది ఇక్కడే వున్నారు. నీవు అందరినీ కలవవచ్చు.' '

టెరెన్స్ ఫోస్టర్ ఇండియన్ పొలిటికల్ సర్వీస్‌కి చెందినవాడు. ఆ రోజుల్లో పొలిటికల్స్ ఇతర సర్వీసుల నుండి సెలెక్ట్ అయేవారు. దాదాపు మూడింట రెండు వంతులు ఐసియస్ నుండి వచ్చేవారు. మిగిలినవారు ఆర్మీనుండి, ఇండియన్ పోలీస్ నుండి వచ్చేవారు. పొలిటికల్ సర్వీస్ మెంబర్స్ తాము అందరికన్నా ఆధిక్యతలో వున్నామనుకునే వారు. వాళ్ళంతా వైస్రాయి స్పెషల్

సర్వీస్ మెంబర్స్. ఆసక్తికరమైన ఉద్యోగాలు, గ్లామర్ వున్న పదవులూ, వోకోసారి ప్రమాదకర మైన ప్రదేశాలకి వారిని పంపుతూ వుండేవారు. ప్రొవిన్షియల్ సర్వీసెస్‌లో వారిలో లాగా మార్పు లేకుండా విసుగెత్తించే వొకే రకమైన ఉద్యోగాలు. తమ సామర్థ్యాన్ని చూపడానికి వీలుండే ఉద్యో గాలు తమవని వారి నమ్మకం. ఈ వూహలు మానవ లోపాలు. న్యూనతా భావాలకి ముసు గులు. రాజ్యభారంలో తమ భూమికని గురించిన అవగాహనలోని అసమగ్రతకి ప్రతీకలు.

ఫోస్టర్‌కి తన పనేమిటో ... తానేమిటో ఇతర వ్యాపకాలకీ ... పనికిరాని గాసిప్‌తో కాలం వెళ్ళ బుచ్చడంలో అతడికి అభిరుచి లేదు. ఎప్పుడైనా వో గ్లాస్ బీర్, ఓ గ్లాస్ వైన్ తీసుకుంటాడు. అతిగా తాగే అలవాటు లేదు. ఈ దేశప్రజల సాధక బాధకాలను అర్థం చేసుకోవడంలోనూ, ఈ దేశ చరిత్రను దొరికినంతవరకు కూలంక షంగా చదివి ఓ అవగాహనకు రావడంలో అతడు కృషి చేసేవాడు. ఈ దేశపు భాషల్నీ, సాహిత్యాన్నీ అధ్యయనం చేయడంలో అతడికి శ్రద్ధ.

పొలిటికల్ ఏజంట్‌కి సంస్థానపు రాజుకి వున్న సంబంధం చాలా సున్నితమయినది. మిత్రుడిలా వ్యవహరించాలి. జాగ్రత్తగా సలహాలిస్తూ కథ నడ పాలి. అన్నీ మంచి సలహాలేనన్న నమ్మకం కలిగించాలి. నిజానికి అవి సలహాలు కావు అన్న సంగతి అందరికీ తెలుసు. అవి ఆర్డర్స్! ఆ ఆర్డర్స్ వెనక ఆంగ్ల రాజ్యాధికారం వున్నది. ఆ సూక్ష్మమైన విషయం ఎవరికీ తెలీని విధంగా వ్యవహరించాలి. దీనికి ఎంతో లౌక్యం ... చాక చక్యం ... సామర్థ్యం ... మెచురిటీ కావాలి.

ఈ రోజులలో వైస్రాయి ఇండియన్ ఎంపైర్‌ని పరిపాలిస్తున్న ఏకైక ఆంగ్ల రాజ్య ప్రతినిధి.

వైస్రాయ్! సింబల్ ఆఫ్ ఇంపీరియల్ పవర్ అండ్ గ్లోరీ!

ఈ దేశంలో వేరు వేరు వంశపు రాజులు, నవా బులు పాలిస్తున్న ఆరువందల సంస్థానాలున్నాయి.

అందువల్ల ఇండియన్ మ్యాప్ రెండు రంగుల్లో వుండేది.

ఆంగ్ల రాజ్యపు ఎరుపు.

ఇతర సంస్థానాల పసుపు.

ఇదే సమయంలో ఇండియాలో చరిత్ర జరు గుతోంది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ ఇతర నాయకులూ స్వాతంత్ర్య సమరానికి పటిష్టమైన రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ చరిత్ర ఏ విధంగా రూపొందబోతోందో రానున్న దశా బ్దాల్లో ఏం జరగబోతోందో ఎవరికీ తెలియదు.

కాలగర్భంలో చరిత్ర దాగి వుంది.

మరునాటి సాయంత్రం ఎపాయింట్‌మెంట్ ప్రకారం బయలుదేరి వైస్రాయిని కలవడానికి టెరెన్స్ ఫోస్టర్ వైస్రాయి కాటేజ్‌కి వెళ్ళాడు.

వైస్రాయి నివాసభవనంగా ప్రారంభమై రాష్ట్రప తి నిలయంగా మారబోయే భవనం నిర్మా ణంలో వుంది. వైస్రాయి దంపతులు టెంపరరీ లాడ్జిలో నివసిస్తున్నారు.

లార్డ్ చెమ్స్‌ఫోర్డ్ వారసుడిగా ఎర్ల్ ఆఫ్ రీడింగ్ ఇండియాకి 1921లో వచ్చాడు. అప్పటికే మోంట్‌ఫర్డ్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి.

ప్రపంచమంతా అల్లకల్లోలంగా వున్న దినాలు.

రష్యాలో విప్లవం జరిగింది. నూతన సామా జిక పరిస్థితులు రూపు దిద్దుకుంటున్నాయి.

మొదటి ప్రపంచ యుద్ధం అయిపోయింది. ప్రపంచ చరిత్ర మారిపోయింది.

ఆ రోజులు ఇండియన్ ప్రజల పరంగా ఆంగ్ల రాజ్య కాలంలో అతి నికృష్టమైన సమయం

ఋతుపవనాలు పూర్తిగా విఫలమయ్యాయి. కరువు పరిస్థితులు నెలకొన్నాయి.

రీడింగ్ లండన్‌లో ఎంతో విజయవంతమైన వకీలు. అతడు పార్లమెంట్‌లో అడుగుపెట్టిన కొద్ది రోజుల్లోనే లార్డ్ చీఫ్ జస్టిస్ అయ్యాడు. మొదటి ప్రపంచ యుద్ధానికి ఆర్థికపరంగా ప్రభుత్వ పునాదిని బలపరచడంలో కుడిభుజం లాంటి వాడని లండన్ టైమ్స్ పేర్కొన్నది. అప్ప టికే అతడు వాషింగ్టన్‌లో బ్రిటిష్ రాయబారిగా పనిచేసి వున్నాడు.

లార్డ్ రీడింగ్ సామాన్యుడిగా తన జీవితం ప్రారంభించాడు. అతడి పేరు రూఫస్ ఐజాక్స్. స్వయంకృషితో మనో నిబ్బరంతో ఏకాగ్రతతో అతడు ఎన్నో ఉన్నత స్థానాలని అలంకరించి 1917 నాటికి ఎర్ల్ గౌరవాన్ని పొందాడు. అతడు ఎంతో స్మార్ట్‌గా వుండేవాడు. దానికి తగిన ఇంటలెక్చువల్ ప్రతిభ అతడికి రాణింపు తెచ్చింది.


అతడిని ఇండియా పంపించడానికి కల ముఖ్యకారణం అతడు యూదుజాతివాడు కావ టమే. ఎంతో జాగ్రత్తగా తీసుకున్న కాబినెట్ నిర్ణయమది. దానికన్నా ముఖ్యమైన కారణం బారిష్టర్స్ అవడంవల్ల వారిని హాండిల్ చేయ డానికి ఆ క్వాలిఫికేషన్ ఎందుకైనా పనికి వస్తుందేమోనన్న చిరు ఆలోచన కూడా ఆ నిర్ణయానికి బలం చేకూర్చింది. అతడు బారి స్టర్ కావడం. అప్పటి ఇండియన్ నేషనల్ లీడర్స్ అందరూ బారిష్టర్స్ కావడం యాదృ చ్ఛికం కాదు.

ఎడిసి ఫోస్టర్‌ని రిసీవ్ చేసుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకువెళ్ళాడు. అక్కడ లార్డ్ రీడింగ్, లేడీ రీడింగ్ వున్నారు. లార్డ్ రీడింగ్ టెరెన్స్ ఫోస్టర్‌తో కరచాలనం చేశాడు. లేడీ రీడింగ్ డెలికేట్‌గా వున్న మస్లిన్ గౌనులో వుంది. ఆమె చేతికి సన్నటి బంగారు బ్రేస్‌లెట్ వున్నది. మెడలో ముత్యాలహారం వున్నది. నెరిసిన బ్లాండ్ జుత్తుతో వుందామె. ఆమె ఆరోగ్యం సరిగా వున్నట్లు లేదు. పాలిపోయి వుంది.

ఫోస్టర్ మేనమామ లండన్‌లో బారిస్టర్. అతడు లార్డ్ రీడింగ్ మిత్రులు. తన మేనల్లుడికి క్షేమ సమాచారాలు చూచుకోమని ఆయన అభ్యర్థన. అదే కాకుండా తన క్రింద పనిచేసే అందరు కుర్ర అధికార్ల యోగక్షేమాలూ చూసుకోవడం తన బాధ్యత అని రీడింగ్‌కి తెలుసు.

"ఫోస్టర్ డియర్ నీ టీలో క్రీమ్ కావాలా?"

"ఫోస్టర్ నువ్వు మరో కేక్ తిని తీరాలి. ఇవి



లవ్లీ చాకొలేట్ కేక్స్."

"మరో కప్ టీ కావాలా డియర్" అంటూ లేడీ రీడింగ్ ఫస్ చేస్తూ మళ్ళీ మళ్ళీ అడిగి తినిపించింది.

టీ తాగటం అయాక తనకి గార్డెన్‌లో రోజ్ బుషెస్ ట్రిమ్ చేసే పని వుందని చెప్పి లేడి రీడింగ్ వెళ్ళిపోయింది.

లార్డ్ రీడింగ్ సిగార్ వెలిగించాడు.

బేరర్స్ టీ సర్వ్ చేసిన వాటిని తీసుకుని వెళ్ళిపోయారు.

కాసేపు వాతావరణం గురించీ... ఢిల్లీలోని కల్చరల్ యాక్టివిటీ గురించి స్మాల్ టాక్ జరిగింది.

లార్డ్ రీడింగ్ అడిగాడు.

"దిశాపూర్‌లో నీ స్టే ఎలా వుంది ఫోస్టర్. బాగా ఎంజాయ్ చేశావా?"

"యస్ సర్"

"మూడేళ్ళయింది కదూ?"

"యస్ సర్"

"ప్రస్తుతం నీ ప్లాన్స్ ఏమిటి ఫోస్టర్?"

"మొదట కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నాను యువర్ హైనెస్. ఇంగ్లండ్ వెళ్ళి అక్కడ ఓ సంవత్సరంపాటు గడపాలని ప్లాన్ వేసుకున్నాను. ఆ పైన ఆలోచించి ఇతర నిర్ణయాలు తీసుకుంటాను. ప్రస్తుతానికి నా ఆలోచన అది సర్.'

"మరి తిరిగి రావడం?"

"సంవత్సరం గడిచాకే అనుకుంటున్నాను సర్."

"మరి నీ పెళ్ళి సంగతేమిటి? ఆ పిల్ల పేరు మేరియన్ రాబర్ట్స్ కదూ?"

ఫోస్టర్ ఆశ్చర్యపోయాడు. ఈయన కెలా తెలిసింది తన గర్ల్‌ఫ్రెండ్ సంగతి!

"మేరియన్ విషయంలో ఓ చిన్న సమస్య వుంది సర్."

"ఏమిటది?"

"మరో అయిదారేళ్ళవరకూ మేరియన్ ఇండియకి రాలేదు. ఏవో వ్యక్తిగత కారణాల వల్ల ఆమెకి కొన్ని బాధ్యతలున్నాయి. అందువల్ల మా పెళ్ళి అంత త్వరగా జరగకపోవచ్చు. మేమిద్దరం కొద్ది రోజులు ఆగాలనే నిర్ణయించుకున్నాము."

"ఐసీ"

పైనున్న ఫాన్ గాలితో చల్లగా వుంది.

"అయితే దిశాపూర్ అనుభవం తర్వాత మరో సంస్థానంలో.. బహుశా ఇంకా పెద్ద సంస్థానంలో... ఇంకా కాంప్లికేటెడ్‌గా వున్నదాంట్లో... ఈసారి 'పనిచేయాలని ఏమైనా ఆలోచన వుందా?"

"లేదు సర్. మీ దయకి నా థాంక్స్. ఇంగ్లండ్ నుండి తిరిగి వచ్చాకే నేను ఈ ప్రశ్నకి సమాధానం చెప్పగలను సర్."

"నీ లాస్ట్ పోస్టింగ్ ఎలా వుంది ఫోస్టర్? ఆ జాబ్‌లో నీకు ఏమైనా నచ్చిన విషయాలు కనిపించాయా? ఎబ్జార్బింగ్... తప్పకుండా చేయవలసిన పనులు అంటూ నీకు ఏమైనా తోచాయా?"

వైస్రాయి కళ్లలోకి చూశాడు యువకుడు. అతడి నీలికళ్ళు ఇంద్రనీలాల్లా మెరిశాయి.

"మీతో నేను ఫ్రాంక్‌గా మాట్లాడవచ్చా సర్?"

లార్డ్ రీడింగ్ కనుబొమలు పైకి లేచాయి.

"మై డియర్ బోయ్! నీవు నాతో ఏమి చెప్పినా అది నిజాయితీతో నిర్మొహమాటంగా వుంటుందనే నేను అనుకొంటున్నాను. వేరే విధమైన అభిప్రాయాలతో నాకు అవసరం లేదు."

"థాంక్యూ యువర్ ఎక్సెలెన్సీ."

కొద్ది క్షణాలు తన ఆలోచనలను ఓ దారిలో పెడుతున్నవాడిలా కనిపించాడు ఫోస్టర్. అతడి భృకుటి సన్నగా ముడిపడింది.

"సర్ మనం ఈ దేశంలో మరో వెయ్యేళ్ళున్నా ఇక్కడ అంతగా పెద్ద మార్పు వుండదు అనుకుంటున్నాను నేను"

లార్డ్ రీడింగ్‌లో చిరు ఉలికిపాటు అతడి కళ్ళల్లో చిరు కలవరం...dismay... ఆశ్చర్యం. వినోదం కలగలిపిన అతడి చూపులో వాత్సల్యం నిండి వుంది. యువకుల అనుభవరాహిత్యాన్నీ, తొందరపాటుతనాన్నీ, నోటి తొందరనీ, స్వల్పమైన అవివేకాన్నీ అర్థం చేసుకునే సామర్థ్యం అతడిలో వుంది. ఒకనాడు తాను ఇటువంటి యువకుడే నన్న విషయాన్ని అతడింకా మరిచిపోలేదు.

"అంటే నీ ఉద్దేశం?"

"మీకు వివరంగా చెప్పాలంటే చాలా టైమ్. పడుతుంది సర్."

"వెల్ నీకు కావలసినంత టైమ్ తీసుకో ఫోస్టర్. నాకివాళ ఎంగేజ్‌మెంట్స్ ఏమీ లేవు. నీ అభిప్రాయాలు వినాలని వుంది. గో ఎ హెడ్.

"సర్ ఇదీ అసలు విషయం... మనం దాదాపు



చిత్రం: గోపీకృష్ణ

రెండు వందల ఏళ్ళ నుండీ ఏదో విధంగా ఇక్కడ అధికారాన్ని చెలాయిస్తూనే వున్నాం. పాక్షికంగానో, పూర్తిగానో... ఏదో మిషతో... ఇన్నేళ్ళలో మనం వీళ్ళకి ఏమైనా చేయగలిగామా అసలు?

ఈ మాటలతో వైస్రాయికి కొంచెం విసుగెత్తింది. ఇంతకీ ఈ యువకుడు తన వాదనని ఏ దిశగా తీసుకెళుతున్నాడు? అసహనంతో గ్రంట్ చేశాడు రీడింగ్.

"నన్ను పూర్తిగా చెప్పనీయండి యువర్ ఎక్సలెన్సీ"

వైస్రాయి రియాక్షన్ పూర్తికాకుండానే యువకుడు అందుకున్నాడు.

"ఈ దేశ ప్రజల కోసం దారి సంక్షేమం కోసం మనం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాము. ఈ దేశపు వైశాల్యంతో.. ఈ దేశపు చారిత్రక క్లిష్టతని పరిగణనలోనికి తీసుకుంటే మనం ఏం చేసినా ఎన్నేళ్ళు చేసినా ఈ దేశ ప్రజల అవసరాలు తీరవు. వీళ్ళ సమస్యలకి పరిష్కారాలు దొరకవు. నిజంగా మనకి ఈ మనుషులు ఏ మాత్రం అర్థంకారు. వాళ్ళ భాషలు మనం మాట్లాడవొచ్చు వాళ్ళ పుస్తకాలు మనం చదవవొచ్చు. వాళ్ళ జీవన విధానాలని మనం అర్థం చేసుకోవచ్చు. వారి ఎడల మనం ఎంతో దయ చూపవచ్చు. ఎన్ని చేసినా మనం ఇక్కడ విదేశీయులం. స్ట్రేంజర్స్.. అలాగే మనం ఈ దేశంలో వుండిపోతాము.

సర్ మన ఆచార్య వ్యవహారాలు మనం పాటిస్తూ మన గ్రూప్స్‌తో మనం బ్రతికేస్తాం. మన ఉద్దేశాలలో ఏ మాత్రం పొరబాటు లేకపోవచ్చు. కాని సంస్కరణలు తీసుకురావడానికీ, అభ్యున్నతికీ మనం చేసే ప్రయత్నాలు అంతగా విజయవంతం కాకపోవటానికి ఎన్నో కారణాలున్నాయి. ఈ విశేష ప్రజానీకానికి కావలసిన ప్రణాళికలు అమలుపరచడానికి మనవద్ద అంత పెట్టుబడి వుండదు. మన పెట్టుబడి మన ఆశయాలూ మన శ్రమ ఇక్కడ వున్న అవసరాల ఎడారిలో చిలకరించే నీటి చుక్కల్లో ఎగిరిపోతాయి."

"ఆక్స్‌ఫర్డ్‌లో నీవు ఏం చదివావు ఫోస్టర్?"

"హిస్టరీ అండ్ ఎకనామిక్స్ సర్"

"ఆ నాకు అర్థమవుతున్నది, నీవు చారిత్రకంగా, ఆర్థికంగా ఈ దేశ పరిస్థితులను 'ఎనలైజ్' చేస్తున్నావు. చరిత్రలో ఎప్పుడూ అవసరానికీ, అది తీర్చుకోవలసిన ప్రయత్నానికీ మధ్య గాప్ వుండటం సహజం ఫోస్టర్. కాదా?"

"నిజమే సర్ ఆ నిర్ణయాలేవో ఆ ప్రజలవే అయివుంటే ఎవరినీ బ్లేమ్ చేయవలసిన అవసరం వుండదు. ఆ నిర్ణయాధికారం ఏలియన్ రూలర్స్... మనకు వుండటంతో వుంది చిక్కు. ఈ దేశంలో ప్రస్తుతం వున్న పరిస్థితి వేరు. దేశావసరాలకి సరిపడే విధంగా మనం కృషి చేస్తున్నాము.

కాని ఫలితాలు సున్నా."

"అలాగా! అయితే ఈ దేశానికి ప్రగతి ఎలా వస్తుందనుకుంటున్నావు ఫోస్టర్?"

"ప్రగతి కావాలన్న ఆకాంక్ష... ప్రజలకి వర నరాల్లో నుండీ ... రక్త బిందువుల్లో నుండీ... అణువుల్లో నుండీ... వారి అంతరంగపు లోతుల్లో నుండీ రావాలి. అది ఈ దేశంలో ఎప్పుడు జరుగుతుందో నాకు తెలియదు. నాకు తెలిసినంతవరకూ అదొక్కటే మార్గం సర్.

రీడింగ్ వైస్రాయిగా వున్న సమయంలోనే స్వాతంత్ర్య సాధనకు మహాత్మాగాంధీ, ఇతర నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. రీడింగ్ మెతకదనం వున్న వైస్రాయిగా ప్రారంభించినప్పటికీ కాలం గడిచిన కొద్దీ అతడు మారిపోయి కఠినమైన చర్యలు తీసుకోవడం మొదలుపెట్టాడు. గాంధీని జెయిల్లో పెట్టి, మొప్లా రెబెలియన్‌ని, శిఖుఖల ఉద్యమాన్ని అతి కఠినంగా అతడు అణచివేశాడు. ఈ దేశం అతణ్ణి మార్చివేసింది.

అతడి మిత్రులలో ముఖ్యులు సర్ తేజ్ బహదూర్ సప్రూ. ఆనీ బీసెంట్.

కాసేపు ఆలోచించి అన్నాడు రీడింగ్.

"న్యాయసమ్మతంగానే ఇండియన్స్‌ని మనం రూల్ చేస్తున్నాం. కాదా ఫోస్టర్?"

"నిజమే సర్. కాని ఆ న్యాయం మనది. నిజాయితీతో పరిశీలిస్తే ఆ పాలన వలన వచ్చిన ప్రగతి ఏమంత చెప్పుకోదగిన లెవెల్లో లేదు. ఏవో కొన్ని రోడ్లు. కొన్ని రైల్వే లైన్స్, కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు, కొన్ని కాలవలు, మరికొన్ని బిల్డింగ్స్, ... కొద్దిపాటి సంస్కరణలు... ఇవేమీ వారి అవసరాలు జనాభాతో పాటు అంతులేకుండా దినం దినం పెరుగుతూనే వున్నాయి."

"మరో వందేళ్ళలో ఈ దేశంలో ఎంతో ఆర్థిక ఔన్నత్యం వస్తుందని నా నమ్మకం" లార్డ్ రీడింగ్ అన్నాడు.

యువకుడు ఆలోచనలో పడ్డాడు.

"ఏమంటావు ఫోస్టర్?"

"సర్! నాదో ప్రశ్న?"

"ఏమిటది మై బోయ్"

"సర్ మనం నిజంగా ఇక్కడ మరో వందేళ్ళు వుంటామని మీరు నమ్ముతున్నారా?"

వాట్ నాన్‌సెన్స్! దిస్ యంగ్‌మాన్ ఈజ్ ఫూలిష్!!!

"కొద్దిగా కాంప్రమైజ్‌లు చేయక తప్పదేమో కాని మౌలికమైన పరిపాలనా విధానంలో పరిస్థితులలో పెద్దగా మార్పులుండవని నా నమ్మకం. ఇక్కడ మనకి మరో వందేళ్ళవరకూ ఢోకా వుండదు."

చుట్ట నుసి యాష్ ట్రేలో రాలుస్తూ రీడింగ్ ఫోస్టర్ కేసి కన్నార్పకుండా చూస్తున్నాడు.

* ఒక రోజు రచయిత శ్రీ ఆత్రేయగారు దర్శకుడు శ్రీ సింగీతం శ్రీనివాసరావు కలుసుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు. మాటల సందర్భంలో ఆత్రేయ "ఇక నేను ఆట్టే కాలం బ్రతకను శ్రీనివాసరావూ! నాకు టైమయ్యింది" అన్నారు వేదాంత ధోరణిలో!

దానికి సింగీతంగారు వెంటనే "పోండి సార్! మీరు నిక్షేపంగా నూరేళ్ళు బ్రతుకుతారు. 'ఆత్రేయ అన్న టయానికి రాయడు - అన్న టైముకి రాడు' అని యమధర్మారాజుగారికి మాత్రం తెలియదా" అన్నారు ఛలోక్తిగా.

—జి. మానస

సీరియస్‌గా అన్నాడు ఫోస్టర్.

"ఐ బెగ్ టు డిఫర్ సర్. చరిత్ర పాఠాల్లో ముఖ్యమైనది ఏనాటి పరిస్థితులలోనూ నమ్మరాదు అన్నది. ఏవీ శాశ్వతంగా ఒకే విధంగా వుండవన్నది సామాన్య సత్యం. పరిస్థితులు మన విశ్లేషణకి భిన్నంగా మారి అందకుండా పోతుంటాయి. మన ఊహలు తలక్రిందులైపోయి ఆశ్చర్యపరుస్తాయి. ఉదాహరణకి మనం మొన్న జరిగిన యుద్ధాన్ని వూహించామా? ఆ యుద్ధం ప్రపంచగతిని ఎన్నో విధాలుగా మార్చలేదా? మన జీవిత కాలంలోనే యూరప్ మనకి ఏ మాత్రం అర్థంకాని విధంగా మారిపోయింది. ఆ మార్పులేవో ఇంకా జరుగుతూనే వున్నాయి. మార్పుల అంకురాలు మనుషుల మనసుల్లో పుట్టి ఆలోచనా మహా వృక్షాలుగా పెరిగి సామాజిక అడ్డగోడల్ని పగలగొట్టి ప్రజలనీ, దేశాన్నీ ఆక్రమించుకుని చరిత్రని మార్చి శాసిస్తాయి. ఇది చరిత్ర విధానం. ఆ మార్పులేవో మనకి అర్థంకాకపోవడానికి కారణం ఆ పెను మార్పులు వస్తున్న పరిస్థితులలో మనం కూడా ఇరుక్కుపోయి వున్నాము కాబట్టి అవన్నీ మన అవగాహనకి అతీతంగా జరుగుతాయనుకుంటాను.

రీడింగ్ కళ్ళల్లో ఎమ్యూజ్‌మెంట్."

అభిప్రాయం చెప్పమంటే తొణక్కుండా చిన్న స్పీచ్ ఇస్తున్నాడే ఫోస్టర్! వాటీజ్ రాంగ్ విత్ హిమ్??

లార్డ్ రీడింగ్ ఆ యువకుడి ముఖం కేసి సాలోచనగా చూశాడు. ఏకాగ్రత, లోతు, దృఢ నమ్మకం, మొండితనం, వైదుష్యం, దుగ్ధ.. అన్నీ ప్రతిఫలిస్తున్నాయి. ఈ కుర్రాడు ఏదో సాధనలో వున్నాడు. అదేమిటో అతడికీ, అతడిని సృష్టించిన ఆ భగవంతుడికే తెలియాలి. ఇతగాడు సీరియస్ మైండెడ్. క్లిష్టమైన మనోవృత్తి కలవాడు. ఇంతకీ ఇతడి సమస్య ఏమిటి?

"ఫోస్టర్ ఈ విషయాలన్నింటినీ నీవు ఇంగ్లాండ్ నుండి తిరిగి వచ్చాక చర్చిద్దాం. ఈసారి నీవు నీ యంగ్ బ్రైడ్‌తో తిరిగి రావాలని మా కోరిక" అన్నాడు లార్డ్ రీడింగ్ చిరునవ్వుతో.

సమాధానం చెప్పకుండా నవ్వాడు ఫోస్టర్.

"చెప్పడం మరిచాను ఫోస్టర్. నిన్న సాయంత్రం మహారాజా విక్రమ్‌సింగ్ నన్ను కలిశాడు. అతడు సడెన్‌గా అపాయింట్‌మెంట్ కావాలని కోరాడు. అతడి అభ్యర్థనని మన్నించి నేను ఆయనతో మాట్లాడాను. దిశాపూర్‌లో పని చేస్తున్నప్పుడు నీ అనుభవం ఎలా వుంది?. మీరిద్దరూ సయోధ్యతో మెలిగేవారా?"

"పెర్‌ఫెక్ట్ అండర్‌స్టాండింగ్ యువర్ ఎక్స్‌లెన్సీ. మహారాజా చాలా సహృదయుడు. స్నేహపాత్రుడు. మా ఇద్దరికీ పోలో అంటే ఇష్టం. టెన్నిస్, స్క్వాష్ కూడా తరుచూ ఆడేవాళ్ళం."

"అతడు నీకేమైనా బహుమతి ఇవ్వడానికి ప్రయత్నించాడా!"

ఫోస్టర్ ఒక్క క్షణం కలవరం చెందాడు. అదా సంగతి? ఓ గాడ్! నాట్ దట్!! నాట్ ఎగైన్!!

"యస్ సర్."

"ఆ బహుమతి ఏమిటి ఫోస్టర్?"

"నాకు తెలియదు సర్. అది ఓ చిన్న పెట్టెలో వుంది. దాన్ని నేను చూడలేదు."

"ఏం చేశావు నువ్వు?"

"పొలైట్‌గా థాంక్స్ చెప్పి నిరాకరించాను సర్."

"ఎందుకని?"

"ఎందుకంటే... ఎందుకంటే... ఆ బహుమతి ఖరీదు ఎంత వుంటుందో నాకు తెలియదు. నేను ఆ ధర చెల్లించలేనేమోనన్న సంశయంతో నిరాకరించవలసి వచ్చింది.'

"అదేమిటో తెలియకుండానే నీవు దాని విలువని ఎలా అంచనా కట్టగలిగావు ఫోస్టర్?"

"నేను అలా అనుకున్నాను సర్. మహారాజా మంచివాడు. లార్జ్ హార్టెడ్ మాన్. వజ్రాలూ, రత్నాలూ అతడికి అతి సామాన్య వస్తువులు. ఇతరులకి అతడు ఇచ్చిన బహుమతులను నేను చూశాను. వాటిలో చ్రాలా భాగం అమూల్యమైనవి. అందువల్ల..." నసిగాడు.

"వొకవేళ మహారాజా ఇచ్చిన బహుమతిని నీవు తీసుకుని వుంటే అతడికి ఏ విధంగానైనా ఋణపడి వుంటానేమోనని నీకు సంకోచమా ఫోస్టర్? ఇంత బ్లంట్‌గా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకు. నాకు విషయాలు తెలియాలి.

"వెల్! కాదనుకుంటాను సర్."

"అతడు నీకో చిన్న బహుమతి ఇచ్చాడు కాబట్టి నీవు అతడికి ఏదో విధంగా ఫేవర్ చేయవలసివుంటుందేమో నని నీవు అనుకున్నావా?"

"నో సర్! నెవ్వర్!"

"మైడియర్ ఫోస్టర్, నేను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్నానని ఫీలవడం లేదు కదా? నా ఉద్దేశం అది కాదు.

"ఆ సంగతి నాకు తెలుసు సర్. నేను ఫీలవడానికి ఇందులో ఏమీ లేదు.

ఓ విధంగా క్రాస్ ఎగ్జామినేషన్‌లా సాగుతున్న ఈ సంభాషణ ఏ దిశగా సాగిపోతున్నదో ఇద్దరికీ అంతుబట్టలేదు. లార్డ్ రీడింగ్ జెంటిల్‌మన్. కాని ఈ ప్రశ్నల పరంపరలో ఆయన ఉద్దేశం ఏమిటి?

"ఫోస్టర్! మహారాజా మంచివాడని నీవు ఒప్పుకుంటున్నావు. అతడేదో చిన్న కానుక ఇచ్చినంత మాత్రాన నీవు అతడికి ఏ విధంగానూ రుణపడవు అన్న విశ్వాసం నీకున్నది. ఆ సంస్థానంలో నీవు చేసిన మంచి పనులను దృష్టిలో వుంచుకుని తన వ్యక్తిగత స్నేహాన్ని పురస్కరించుకుని ఈ చిరుకానుకని నీకు ఇవ్వాలని సింగ్ ఆశయం అయితే నీకున్న అభ్యంతరం ఏమిటి?"

"నాకు తెలియదు సర్. ఆయన ఇచ్చే కానుకలు ఏవైనా అతి విలువైన ఆభరణాలు. వజ్రాలు పొదిగిన అమూల్యమైన ముత్యాలై వుంటాయని నా ఊహ. అలాంటి వాటితో నాకు ఏ మాత్రం ఉపయోగం వుండదు కాని ఏ విధంగానూ అవసరం లేని వస్తువులను తీసుకోవటంలో ఔచిత్యం లేదు. అంతేకాకుండా ఆ అమూల్యమైన వస్తువులకి ధర కట్టి ఆ డబ్బు ట్రెజరీలో జమచేసే తాహతు నాకు ఆర్థికంగా లేదు. ఈ చిక్కులన్నీ కోరి తెచ్చుకోవడం ఎందుకు అన్న కించిత్తు ఆలోచన నా నిర్ణయానికి బలాన్నిచ్చింది.

"అయితే బహుమతులు వుపయోగకరంగా వుండాలని నీ ఉద్దేశమా ఫోస్టర్."

"అవును సర్."

"అంటే అనుదినం ఏదో రకపు దైనందిన కార్యక్రమంలో వుపయోగపడాలనీ... ఆ వస్తువేదో అతి విలువైనది కాకూడదనీ నీ ఉద్దేశం అవునా?"

"అవుననుకుంటాను సర్."

లార్డ్ రీడింగ్ బాక్ గ్రౌండ్ టెరెన్స్ ఫోస్టర్‌కి తెలుసు. స్వయంకృషితో ఒక తరంలో లాయర్‌గా ఎంతో ధనాన్ని సంపాదించి లండన్ పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రాముఖ్యం పొంది పైకి వచ్చిన ఓ అనామక యూదుజాతి వ్యక్తి. అతడికి వస్తువుల విలువ తెలుసు. మనుషుల నమ్మకాలు, పట్టుదలలోని తేడాలు తెలుసు. గుణగణాలను బేరీజు వేయగల సామర్థ్యం వున్న మనిషి

లార్డ్ రీడింగ్ సన్నగా నిట్టూర్చి అన్నాడు. "మైడియర్ ఫోస్టర్ మహారాజా విక్రమ్‌సింగ్ నీకు ఇవ్వబోయిన బహుమతి ఓ సామాన్యమైన సిగరెట్ లైటర్. నీవు సిగరెట్స్, సిగార్స్, స్మోక్ చేస్తావు అన్న సంగతి అతడికి తెలుసు. అందువల్లనే అన్నివిధాలా నీకు వుపయోగపడే అతి సామాన్యమైన కానుకని బాగా ఆలోచించిన తర్వాతనే నీకు ఇవ్వాలని సంకల్పించాడు. అది ఏమంత ఖరీదైనది కూడా కాదు."

"ఐసీ సర్" విస్మయంతో అన్నాడు ఫోస్టర్.

ఎంత పని జరిగింది! తన కళ్ళు తెరుచుకున్నాయి. ఎంత మంది ఆలోచన! ఎంత మంచి బహుమతి! తనకు ఎంతో వుపయోగంగా వుంటుంది లైటర్. కాని తన ప్రవర్తన ఎంత జుగుప్సాకరంగా వుంది! ఓ లార్డ్!!

అయితే ఫోస్టర్ నేను నిన్ను అడిగితే ఆ బహుమతిని స్వీకరిస్తావా?"

"యస్ సర్ తప్పకుండా."

"అలా అయితే ఆ బహుమతిని నీవు తీసుకోమని నేను ఆజ్ఞాపిస్తున్నాను. ఇదిగో."

అంటూ ఎర్రకాగితంతో గిఫ్ట్‌రాప్ చేసివున్న ఓ చిన్న పెట్టెను ముందుకు తోశాడు. అది నల్లగా మెరుస్తున్న మహాగనీ టేబుల్ మీద మెత్తగా జారి ముందుకు వచ్చి ఫోస్టర్ ముందు ఆగింది. ఫోస్టర్ దానిని తీసి పైకెత్తి చూశాడు. అతడి కళ్ళల్లో కొద్దిపాటి కలవరం వుంది.

What a fine mess!-

రీడింగ్ చిరునవ్వుతో మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నిన్న సాయంత్రం మహారాజా ప్రత్యేకమైన ఎపాయింట్‌మెంట్ తీసుకుని వచ్చి నన్ను కలిసి జరిగిన సంగతి చెప్పాడు. నీవు ఈ బహుమతిని తీసుకోకుంటే తన సంస్థానంలో అతడికి పరువు పోతుంది. He loses face. అతడికి నీవంటే ఎంతో గౌరవం. నీ సంగతి అతడికి బాగా తెలుసు. నీ ఆశయాలు అతడికి అర్థమయ్యాయి. నీ అభిప్రాయాలు అతడికి నచ్చాయి. నీ ముక్కుసూటితనం సిన్సియారిటీ, సింప్లిసిటీ అంటే అతడికి ప్రత్యేకమైన అభిమానం. నీవు ఈ కానుకను ఆమోదించడం వల్ల అతడికి ఎంతో ఆనందం కలుగుతుంది. అతడి తరఫున ఈ చిన్ని బహుమతిని తీసుకోమని నేను మళ్ళీ చెబుతున్నాను." –

అని కరుణ నిండిన కళ్ళు మెరుస్తుండగా సన్నగా నవ్వాడు. అతడి హాండ్సమ్ సెమిటిక్ ఫేస్‌లో ఆనందం తాండవించింది. ఆ చిరునవ్వులో విజయసూచకపు ఛాయలున్నాయి.

టెరెన్స్ ఫోస్టర్ బహుమతి వున్న పెట్టెని చేతుల్లోనికి తీసుకుని అటూ ఇటూ త్రిప్పి చూశాడు. అది అంత బరువుగా లేదు. కన్నార్పకుండా దాని వంకకు కాసేపు చూసి టేబుల్ మీద వుంచాడు.

అతడు కొద్ది క్షణాలు కళ్లు గట్టిగా మూసుకున్నాడు.

అంతటా నిశ్శబ్దం.

ఫోస్టర్ నిట్టూర్చాడు.

రీడింగ్ అతడి ముఖాన్ని కన్నార్పకుండా చూస్తూ వున్నాడు.

బయట లాన్స్ మీద చెట్ల నీడలు పొడవుగా పరచుకుంటున్నాయి. చీకటి పడటం ఇంకా కొద్దిసేపట్లో ప్రారంభమౌతుంది.

రీడింగ్ సిగార్ వెలిగించి పొగ ఘాటుగా వూపిరితిత్తుల్లోకి లాగి వదిలాడు నీలిరంగు స్మోక్ చుట్టూ పరచుకుంటోంది.

కొద్దిసేపు దీర్ఘాలోచన తర్వాత ఫోస్టర్ తన ఆలోచనలను కుదుటపరచుకుని మెల్లగా అన్నాడు. అతడిలో ప్రశాంతత కనిపించింది.

"సర్ ప్రస్తుతం నేనో ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకున్నాను."

"ఏమిటది మై డియర్ బోయ్?"

"నేను సర్వీస్ నుండి రిజైన్ చేసి ఆక్స్‌ఫర్డ్ వెళ్ళి అక్కడ నాకు ఎంతో ప్రీతిపాత్రమైన చదువులో నిమగ్నమైపోవాలని అక్కడ నాకు ప్రొఫెసర్ రిచర్డ్సన్ దగ్గర ఓ సీట్ కాచుకుని వుంది. ఎప్పటి నుండో ఆ ఆఫర్ నా కోసం ఎదురుచూస్తున్నది. నేను ఇన్నాళ్ళూ సరైన నిర్ణయం తీసుకోలేక సతమతమౌతున్నాను. టైమ్ హేజ్ కమ్ నౌ!"

రీడింగ్‌ని ఎవరో ఛెళ్ళున లెంపకాయ కొట్టినట్లుగా అతడి ముఖం వివర్ణమయింది. మొదటగా రక్తం నిండిన ముఖం కందగడ్డలా మారింది. మరుక్షణం రక్తం ఇంకిపోయి పాలిపోయింది. ఈ ఆకస్మిక పరిణామం అతడిని కుదించిపారేసింది. అతడి చేతిలోని సిగార్ జారి టేబుల్ మీద పడింది. తీసి దాన్ని యాష్ ట్రేలో పడేశాక కూడా అతడిలోని యాజిటేషన్ తగ్గలేదు.

"మైడియర్ ఫోస్టర్! అయామ్ సారీ. నిన్ను ఏ విధంగానైనా నొప్పిస్తే నేను బాధ పడుతున్నాను. నియంతలా నిన్ను శాసించే అధికారం నాకు లేదు. నేను ఇచ్చింది సలహా మాత్రమే. అది నిజమైన ఆజ్ఞ కాదు. నా సలహాలని తీసుకోవాలని ఎక్కడా లేదు. అది నీ వ్యక్తిగత నమ్మకాలకి విరుద్ధంగా వుంటే అది నా పొరపాటు. నా సలహాకి నీలో అంత వ్యతిరేకత వుంటే నీవు ఆ విషయాన్ని పూర్తిగా

## గర్భవతులే వివాహానికి అర్హులు

గర్భవతులే వివాహానికి అర్హులంటే మనకు ఆశ్చర్యం కలగవచ్చు. కాని ఇది పచ్చి నిజం. స్కాట్‌లాండ్‌లో గర్భధారణే వివాహానికి అర్హతంట. వివాహం నాటికి ప్రతి పెళ్ళికూతురు ఆరు నెలల గర్భాన్నో, ఎనిమిది నెలల గర్భాన్నో మోస్తూ వుంటుంది. గర్భధారణ జరగని పక్షంలో ఆ స్త్రీలు వివాహానికి అనర్హులు.

– పి.ఎస్.ఎన్. రెడ్డి

మరిచిపో. ఏదీ నీ కెరియర్ కన్నా ముఖ్యం కాదు. నీ భవిష్యత్తునీ, నీ బంగారు జీవితాన్నీ కాలదన్నదగినంత ముఖ్యమైన వస్తువులు లోకంలో ఏవీ లేవు. నీవు ఇలాంటి నిర్ణయాన్ని తీసుకోవడానికి కారణం నేనేనని తెలిస్తే నన్ను ఎవరూ క్షమించరు. నన్ను నేనే క్షమించుకోలేను. డు యూ గెట్ మీ?"

అతడిలో ఆందోళన అధికమయింది.

కంఠంలో ఆవేశంతో ఉద్విగ్నతతో అతడు చలించిపోయాడు.

ముఖంలో వెల్లివిరిసిన మందహాసంతో ఫోస్టర్ అన్నాడు.

"లేదు సర్. ప్రస్తుతం జరిగిన సంఘటనకీ నా నిర్ణయానికీ ఏమీ సంబంధం లేదు. చాలా రోజుల నుండి నేను ఆలోచిస్తున్నాను. ఈ దేశంలో నేను అధికారికంగా తీసుకుంటున్న నిర్ణయాలు, పరిపాలనలో నా భూమికను గురించి నాకో దృఢమైన నమ్మకం ఏర్పడింది. వేలాది, లక్షలాది రకరకాల పేర్లతో డిజిగ్నేషన్స్‌తో విస్తృతమైన అధికారాలతో ఈ దేశం మీద వదిలితే అధికారాలతోపాటు వాటిని అమలు చేయటానికి సామాన్యులకి ఏమాత్రం అర్థంకాని రూల్స్‌తో రెగ్యులేషన్స్‌తో ఈ దేశ ప్రజల సమస్యలు తీరిపోతాయనుకోవటంలో భయంకరమైన తెలివితక్కువతనం వుందని నా నమ్మకం. మన విదేశ విలువలతో, ఆంగ్ల సంప్రదాయపు ఆలోచనలతో మనం ప్రత్యేకమైన అవేవో వుద్దేశ్యాలతో తయారుచేసిన రూల్స్‌తో ఈ దేశాన్ని పరిపాలించాలనుకోవడమే పెద్ద ఫాలీ. అదే వారసత్వాన్ని ఈ దేశ ప్రజలకి ఇచ్చి వెళ్ళిననాడు ఆ ఫాలీ ఇంకా పెరిగే అవకాశముంది. ప్రజా సమస్యలు అధికారులకి పట్టవు. వాటిని క్లిష్టతరం చేయడానికి పనికి వస్తారా ప్రభుత్వాధికారులు. నిజమైన సమస్యా పరిష్కారానికి వారికి యోచన వుండదు. అవగాహన చాలా స్వల్పంగా వుంటుంది. విదేశీయులమైన మనం ఈ దేశ ప్రజల సమస్యలను సాల్వ్ చేయాలనుకోవటంలోనే వుందేమో సమస్యల మూలకారణం. కాని ఈ కాంప్లెక్స్ ఇస్యూలను స్టడీ చేసి అర్థం చేసుకోవాలన్న ఆకాంక్ష వుంది నాకు. అవకాశమున్నంతవరకు సమస్యలకు చారిత్రక అవగాహనలో శోధించాలని నా అభిమతం. ఒకవేళ నాకు సమాధానం దొరుకుతుందేమోనన్న ఆశ వుంది. అందుకు నా జీవితాన్ని వెచ్చించడానికి కూడా నేను సిద్ధం. ఇదంతా ఎకడమిక్స్‌కి సంబంధించినది. సమాధానాలు నాకు దొరుకుతాయో లేదో నాకు తెలియదు. ప్రయత్న లోపం లేకుండా చేయాలని నా అభిమతం. శ్రమ ఎన్నటికీ వృధా కాదని నా నమ్మకం సార్"

"నీవు బాగా ఆలోచించే మాట్లాడుతున్నావా ఫోస్టర్?"



"అవును సర్. నా మాటల వెనుక ఏళ్ళ తరబడిన ఆలోచన వుంది. మథనం వుంది."

"ఆర్ యూ ష్యూర్?"

"అయామ్ నెవర్ ష్యూరర్ సర్"

"అందరూ నీలాగే ఫీలయితే ఆంగ్ల సామ్రాజ్యం ఏమవుతుంది ఫోస్టర్?"

"అది నా సమస్య కాదు సర్"

"మరి ఈ అధికార బాధ్యతలు? ఒక్కసారిగా ష్రగ్ చేసి దులిపేసుకుని వెళ్ళిపోవడమేనా ఫోస్టర్?"

"ఈ కలోనియల్ అధికార బాధ్యతలు స్వీకరించడానికి చాలా కాంపిటేషన్ వుంటుంది. వాటికి తగ్గవాళ్ళు ఎందరో వుంటారు. దేర్ మస్ట్ బి మెనీ"

"ఫోస్టర్ మై డియర్ బోయ్ అలా అయితే ఈ నిర్ణయంతో నీ భవిష్యత్‌కి ఓ విధమైన అంతం లాంటి పరిస్థితి అవుతుందని ఆలోచించావా?"

ఫోస్టర్ నవ్వాడు. అతడి నవ్వు చూసి రీడింగ్ షాక్ తిన్నాడు. ఈజ్ హి క్రేజీ! నవ్వుతాడేమిటి.

"జీవితాలు చిత్రమైనవి యువర్ ఎక్సెలెన్సీ. మనుషులు వాళ్ళు ఏమి చేయాలో ఓ ప్లాన్ ప్రకారం నిర్ణయించుకుని అమలులో పెట్టి గడపాలనుకోవడం దుర్లభం అనుకుంటాను. దొరికిన అవకాశాలను బట్టి మారే దేశకాల పరిస్థితులను బట్టి మనుషుల జీవితాలు జరుగుతుంటాయనుకుంటాను. ఎవరో కొందరు మాత్రం తమ మేధాబలంతో కాలగతులను అధిగమించి వాటిని శాసించి తమకు అనుకూలంగా మార్చుకుని అన్నింటినీ మార్చేసి చరిత్రని సుసంపన్నం చేస్తారు. వాళ్ళు మహానుభావులు. వాళ్ళు చాలా అరుదు. మిగిలిన వాళ్ళు ఎలాగో బ్రతికేస్తారు. నేనూ అంతే ఆక్స్‌ఫర్డ్‌లో నాకు వచ్చే చిన్న ఉద్యోగం నా అవసరాలకి సరిపోతుంది. మేరియన్‌ని పెళ్ళిచేసుకుంటే నా ఒంటరి జీవితానికి ఆలంబన దొరుకుతుంది. ప్రస్తుతం నా అవసరాలు అవే ఇంతకన్నా లోతుగానూ, దూరం నేను ఆలోచించలేదు. నేను లేకపోవడంవల్ల పొలిటికల్ సర్వీస్‌కి ఏమాత్రం లోటురాదు."

తేలిగ్గా హాయిగా నవ్వాడు.

"ఫోస్టర్ ఏమైనప్పటికీ నీవు ఇంతకన్నా మంచి కారణం ఇవ్వకపోతే నేను నీ రాజీనామాను ఆమోదించను తెలిసిందా?"

రీడింగ్ ముఖంలో చిరాకు ప్రతిఫలించింది. వేదనతో అతడు నిలువునా చలించిపోతున్నాడు.

"ప్లీజ్ యువర్ ఎక్స్‌లెన్స్. ఇంతకంటే మంచి కారణం ఇవ్వాలంటే నాకు సాధ్యం కాదు. అది నేను తీసుకున్న నిర్ణయం. దానితో మీకు ఏవిధంగానూ సంబంధం లేదు. ఆ నిర్ణయానికి మీరు బాధ్యులు కారు. మిమ్మల్ని ఏ విధంగానైనా ఇరకాటంలో పెడితే నన్ను క్షమించమని వేడుకుంటున్నాను. మీరంటే నాకున్న గౌరవం భక్తిలో ఏమీ మార్పులేదు. మీరు నాకు చూపించిన వాత్సల్యం, నా వెర్రిమొర్రి మాటల్ని ఓపిగ్గా విని నా మూర్ఖత్వంతో బాధపెట్టినప్పటికీ నన్ను ప్రేమగా చూసినందుకు మీకూ లేడీ రీడింగ్‌కూ నేను ఎల్లకాలమూ ఋణపడి వుంటాను. ఇప్పుడు నేను తీసుకున్నది నా స్వయం నిర్ణయం. పూర్తి బాధ్యత నాదే. దయవుంచి నా మాటలు నమ్మండి."

రీడింగ్ ముఖంలో విషాద ఛాయలు దట్టమయ్యాయి.

"నా మాట విను ఫోస్టర్. ఆ బ్లడీ గిఫ్ట్‌వల్ల నీవు ఇంత దారుణమైన పనిచేస్తున్నావంటే నాకు బాధగా వుంది. నీవు అంత స్ట్రాంగ్‌గా ఫీలయితే నీవు ఆ డామ్డ్ లైటర్‌ని తీసుకోనవసరం లేదు. నేను మహారాజాతో దానిని తీసుకు పొమ్మని చెబుతాను. ఆల్ రైట్?"

ఆ పాకెట్ వేపు చేయి చాచాడు.

ఫోస్టర్ చిరునవ్వుతో

"నో సర్. ఈ లైటర్‌ని నా దగ్గరే వుంచుకుంటాను. నేను చెప్పినట్లుగానే ఈ లైటర్‌కీ నా నిర్ణయానికీ సంబంధం లేదు. చాలా రోజుల నుండీ ఆలోచన జరుగుతున్నది. ఏదో ఒనాడు జరగవలసిదే."

"మై డియర్ బోయ్! అది ఈ రోజే ఎందుకు జరగాలి? మీ అంకుల్ నన్నేమంటాడు? తన మేనల్లుడిని మూర్ఖ ప్రవర్తనమండి తప్పించలేకపోయానని నన్ను తిట్టుకుంటాడు. నీ బంగారు భవిష్యత్‌ని విసిరిపారేయడానికి నేను బాధ్యుడునని నన్ను శపిస్తాడు."

"ఆయనకి నేను లండన్ వెళ్ళగానే వివరంగా చెప్పి నచ్చచెప్పుకుంటాను సర్. జీవితంలో డిప్లొమేటిక్ సర్వీస్‌కన్నా ముఖ్యమైనవి ఎన్నో వున్నాయి. నాకు నచ్చిన విషయాలలో పరిశోధన చేసే అవకాశం నాకు ఇప్పుడు లభిస్తుంది. నాకు కావలసిన మను

షులతో జీవితాన్ని పంచుకునే అదృష్టం ఇప్పుడు దొరుకుతుంది. స్కాలర్ల సర్వెంట్స్...ఆక్స్‌ఫర్డ్‌లో పనిచేసే ప్రివిలేజ్ కన్నా నాకు ఏదీ ముఖ్యం కావు. సర్ మిమ్మల్ని చేతులు జోడించి అర్థిస్తున్నాను. నా గురించి మీరు ఏమీ బాధపడకండి."

బరువైన గుండెను కుదుట పరచుకుని ఎమోషన్ని అదుపులోనికి తెచ్చుకుని లార్డ్ రీడింగ్ నిలబడ్డాడు.

"ఆల్‌రైట్ యంగ్‌మాన్. నీకుగుడ్‌లక్ కలగాలని ఆశిస్తున్నాను. గాడ్ బ్లెస్‌యు.

"థాంక్యూ సర్"

కరచాలనం చేసి ఫోస్టర్ రీడింగ్ వంకకు కృతజ్ఞతా పూర్వకంగా చూశాడు.

రీడింగ్ వెనక్కి తిరిగి లాడ్జ్ లోపలికి వెళ్ళిపోయాడు. అతడు పెదవులు గట్టిగా అదిమిపెట్టినట్లుగా వున్నాయి. గాంభీర్యం మళ్ళీ అతడిలో ద్యోతకమయింది.

ఫోస్టర్ బయటకు వచ్చాడు. వైస్రాయి లాడ్జిలో లైట్లు వెలిగించాడు. ఢిల్లీ నగరమంతా లైట్లతో నిండి వుంది.

గుండెలనిండా గాలి పీల్చుకుని వదిలాడు.

ఫోస్టర్ తేలికగా ఫీలయాడు. పలుచటి సాయంత్రపు పొగ మంచు ఢిల్లీని ఆవరించి వుంది.

కారులో ఎక్కి కూర్చుని సిగరెట్ వెలిగించి పొగని తనివితీరా గుండెల్లోనికి పీల్చి వదిలాడు అతడి చేతిలో లైటర్ ఫ్లేమ్ సన్నగా వెలుగుతోంది. ఆ దీపశిఖ వంకకు చూసి నవ్వుకొన్నాడు టెరెన్స్ ఫోస్టర్.

కారు కదిలింది.

## CODA

పి అండ్ ఓ లైన్స్ నౌక ప్లిమత్ రాక్ ప్రయాణానికి బొంబాయి హార్బర్‌లో సిద్ధంగా వుంది. నౌక ఇంగ్లండ్ చేరుకోవడానికి కొద్ది వారాలు పడుతుంది. ఆంగ్లేయులు తమ కుటుంబాలతో హార్బర్‌కి తరలి వచ్చి వున్నారు. బలవంతంగా చిన్న వయసులోనే ఇంగ్లండ్‌లో స్కూళ్ళలో చేరటానికి పోతూ మొదటిసారిగా తల్లిదండ్రులకి దూరమవుతున్న చిన్న పిల్లలు బిక్కమొహాలతో వున్నారు. కొందరు బాహాటంగా ఏడుస్తున్నారు. ధైర్యం చెబుతున్నారు తల్లిదండ్రులు.

"బీ బ్రేవ్ జిమ్మీ"

"యూవారె గుడ్ గాల్ సుమంతా"

"మేము త్వరలో వచ్చి మీ స్కూల్ చూస్తాం సరేనా డార్లింగ్?"

"ఆంట్ బియాట్రిస్‌కి ఏమీ ఇబ్బంది కలగనివ్వకూడదు సుమా"

"ప్రామిస్?"

బొంబాయి హార్బర్ కస్టమ్స్, ఎమిగ్రేషన్ అధికారుల నావల్ ఆఫీసర్లతో బిజీగా వుంది.

వైట్ డ్రిల్ పాంట్‌తో పైన బ్లీడింగ్ మద్రాస్ ఫ్రాక్కాతో కాళ్ళకి కాన్వాస్ బూట్లతో వున్నాడు ఫోస్టర్. అతడి ఎమిగ్రేషన్ తతంగం పూర్తయింది. సామాన్లు అతడి కేబిన్‌లో సర్ది కూలీలు వెళ్ళిపోయారు.

ఇంకా టైమ్ వుంది.

ఫోస్టర్ చేతిలో ఆనాటి టైమ్స్ ఆఫ్ ఇండియా పేపర్ వుంది.

హోల్డెన్ స్టాఫర్డ్ మరో మిత్రుడు రాడ్నీ స్మిత్ తనకి ఫేర్‌వెల్ ఇవ్వడానికి బొంబాయి వస్తామని టెలిగ్రామ్ ఇచ్చారు.

వాళ్ళీపాటికి రావాలి. హోల్డెన్ అలవాటు ప్రకారం లేట్.

ఇన్‌కారిజిబుల్ హోల్డెన్! ఎన్నటికీ మారడు.

ఎండ ముదిరింది. అరేబియన్ సముద్రం మీద నుండి చల్లటి గాలులు వీస్తున్నాయి. గాలిలో తేమ వుంది.

హార్బర్‌లో రకరకాల షిప్‌లు మర్చెంట్ నావీ నౌకలు, నావల్ ఫ్రిగేట్స్ ఆ ప్రాంతం నిండా నావిక యూనిఫారమ్స్‌లో వున్న మనుషులు ఎక్కువగా వున్నారు.

"హే ఫోస్టర్" అరుపు విని ఆ దిశగా చూశాడు.

దూరంగా హోల్డెన్ స్టాఫర్డ్, రాడ్నీ స్మిత్ తన వేపే చేతులు వూపుతూ వస్తున్నారు. ఆ జన సమ్మర్దంలో మనుషుల్ని తోసుకుంటూ ప్రక్కకి జరుగుతూ ఆ జనప్రవాహంలో ఈదుకుంటున్నట్టుగా తన వేపుకి వస్తున్నారు.


థాంక్ గాడ్ టైముకే వచ్చారు.

నవ్వుతూ చేతులూపుతూ నిలబడ్డాడు ఫోస్టర్.

"లేట్ ఎగైన్ హోల్డేన్ మై బోయ్?"

"కాని ఈసారి కారణం అదికాదు. టెర్రీ నీవు నా మాట నమ్మి తీరాలి."

"కారణం ఏదైనా నీ ప్రవర్తనలో కన్సిస్టెన్సీ వుంది."




"టెర్రీ. టెర్రీ...నీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు."

"వాటీజ్ ది మేటర్ హోల్డెన్!"

విపర్ణమైన వదనంలో అంతులేని వేదనా ఛాయలు. అంతర్మథనపు అల్లకల్లోలం పగిలే అగ్నిపర్వతాల వినిపించని శబ్దాలు, లావాలా మనసు పొరల్ని చీల్చుకుని వస్తున్న బాధా హాలాహలాన్ని భరిస్తూ కను పాపల నుండి ఉబుకుతున్న కన్నీటి జలపాతాన్ని కంట్రోల్ చేసుకుంటూ అతడేదో చెప్పబోతే అతడి గొంతులో ఆ ధ్వనులు బొంగురుగా అస్పష్టంగా వినిపించాయి.

"కమాన్ హోల్డెన్ ఏమయింది."

హోల్డెన్ చేతిలో రెండు కేబుల్ గ్రాములున్నాయి. వాటిని వణుకుతున్న చేతులతో ఫోస్టర్‌కి ఇచ్చాడు.

మెల్లగా మొదటిది కేబుల్ చదివాడు ఫోస్టర్.

"గుడ్ గాడ్" అన్నాడు.

"టేకిట్ ఈజీ టెర్రీ" అన్నాడు హోల్డెన్ సాఫర్డ్ ఆందోళనతో.

ప్రొఫెసర్ రాబిన్సన్ చనిపోయాడు. అంత్యక్రియలు జరిగిపోయాయి. ఆక్స్‌ఫర్డ్ సెమెటరీలో ఖననం చేయటం జరిగింది అన్నది కేబుల్ సారాంశం.

సైలెంట్ ప్రేయర్‌లా గట్టిగా కళ్ళు మూసుకున్నాడు ఫోస్టర్.

"ఇప్పుడు ఏమవుతుంది టెర్రీ?" అన్నాడు రాడ్నీ స్మిత్.

"వెరీ సింపుల్ రాడ్నీ. నా శోధన జరుగుతుంది. కాని ప్రొఫెసర్ రాబిన్సన్ గైడెన్స్ వుండదు. ఆయన ఆశీస్సుతో ఆయనకి నా సామర్థ్యం మీద వున్న నమ్మకాన్ని పదే పదే మననం చేసుకుంటూ ఆయనకి నా మీద వున్న నమ్మకం వమ్ముకాకుండా పనిచేయవలసిన బాధ్యత నా భుజాల మీద వుంచాడు ప్రొఫెసర్. ఆ లక్ష్యాన్ని అనుక్షణం గుర్తు చేసుకుంటూ నేను నా పని పూర్తి చేస్తాను. అంతకన్నా చాయస్ ఏముంది రాడ్నీ!"

హోల్డెన్ కళ్ళల్లో కొద్ది రిలీఫ్.

థాంక్‌గాడ్ బాడ్ న్యూస్ నంబర్ వన్‌ని బాగానే హాండిల్ చేశాడు.

కాని నెంబర్ టు?

రెండో కేబుల్ చదివాడు ఫోస్టర్

అతడి కళ్ళు చిన్నవయ్యాయి.

తల పంకించి మరోసారి చదివాడు.

మెల్లగా అతడి ముఖం విప్పారిందిThis is incredible అనుకున్నాడు హోల్డెన్.

Unbelievable!

అప్పుడు గట్టిగా నవ్వాడు ఫోస్టర్. చుట్టూ వున్న ఆంగ్లేయులు విస్మయంతో అతడి దిశగా చూశారు.

"టెర్రీ! టెర్రీ! వాటీజ్ ఫన్నీ!"

"నీకు తెలియదు హోల్డెన్?"

"టెర్రీ ఆ కేబుల్ నిన్ను ఎంతో బాధకి లోను చేస్తుందనుకున్నాం మేమందరం. ఆ న్యూస్ నీకు ఎలా చెప్పాలో కూడా మాకు తోచలేదు. చివరకు మన క్లబ్ మెంబర్స్ నన్ను పంపారు. రాడ్నీ నాకు తోడుగా వచ్చాడు."

"మీకందరికీ నా పైన వున్న అభిమానానికి నేను కృతజ్ఞుణ్ణి హోల్డెన్. కాని ఇందులో మీకు అంతగా వర్రీ అవవలసిన విషయమేముంది? మేరియన్ నిర్ణయానికి నేను ఆనందిస్తున్నాను. మంచిపని చేసింది మేరియన్‌ని ఐదారేళ్ళు నా కోసం ఎదురు చూడమని కోరడంలోని స్వార్థం నాకప్పుడు అర్థం కాలేదు. మనమంతా మనుషులం హోల్డెన్. కాదా? అందమైన ఆడపిల్ల పెళ్ళి లేకుండా వేలాది మైళ్ళ దూరంలో ఇంగ్లండ్‌లో వుండాలనుకోవడం చాలా ఫూలిష్. ఒకవేళ నేను ఏ లోకల్ బ్యూటీతోనూ ప్రేమలో పడితే వయసు మీరిన మేరియన్ గతి ఏమవుతుంది. మనసులు మార్చుకోవటంలో వింత ఏముంది? ఏమయితేనేం మేరియన్ ఎంతో ఆనందంగా వుండాలని కోరుకుంటున్నాను."

"అయితే నీకేమౌతుంది టెర్రీ"

"ఏమవుతుంది? ఎక్కడున్నానో అక్కడే వుంటాను. ప్రస్తుతం ఇక్కడ జోకులు వదిలేస్తే నా వయసు ముదిరిపోలేదు. ఇరవై ఆరేళ్ళే కదా. ఇంగ్లండ్‌లో ఎందరో అందమైన ఆడపిల్లలు నాకు తగ్గవాళ్ళు దొరుకుతారు. తొందరేముంది?

షిప్ మొదటి విజిల్ వేసింది ఏనుగు ఘీంకారంలా.

నౌక మీదకు పాసెంజర్స్ ఎక్కుతున్నారు. చుట్టూ ఫేర్‌వెల్స్ జరిగిపోతున్నాయి.

ఇవి ఆంగ్ల రాజ్యపు పతాక దినాలు. పీక్ ఆఫ్ ది ఎంపైర్! నలుదిక్కులా, ఖండఖండాలా విస్తరించిన రాజ్యంతో ఆంగ్లేయులకి మానవ చరిత్రలో ఏ జాతికీ ఇతర జాతులు చూడలేని తిరుగులేని అధికారపు రోజులవి. కానీ ఈ ఔన్నత్యపు నీడల్లో రహస్య చరిత్ర శక్తి పొంచి వున్నది. కళ్ళు చెదిరే వైభవంతో అలరారుతున్న రాజ్యపు గోడలకి సన్నటి పగుళ్ళు ఇచ్చుతున్నాయి. ఈ నాటకంలోని ప్రధాన పాత్రధారులకి తెలియదు రానున్న పరిణామాల ప్రభావం. వారి మనసుల్లో ఇంపీరియల్ మూడ్... వారి నిద్రలో ఇంపీరియల్ డ్రీమ్...వారి లక్ష్యం ఇంపీరియల్ డెస్టినీ...అంతులేని అధికారం. ఎండ్‌లెస్ ఎంపైర్.

"నువు మమ్మల్ని వదిలి వెళ్ళిపోతున్నావు. నీ సహచర్యం మేము మిస్ అవుతాము టెర్రీ. క్రికెట్ మాచెస్...పోలో గేమ్స్...రమ్మీ....నువు లేకపోతే మజా వుండదు."

"కొద్ది రోజులపాటు అది నిజం. ఆపైన రొటీన్ పనులలో అన్నీ మరచిపోతారు హోల్డెన్. అయినా ఇక్కడ ఎన్నాళ్ళుండమని మీ ఆలోచన?"

రాడ్నీస్మిత్ అన్నాడు.

"టెర్రీ మనకున్న వొకే వొక సమస్య. ఈ స్వరాజిస్టులు, వాళ్ళ తరఫున గాంధీ. వాళ్ళలో ఎన్నో విరుద్ధమైన భావాలున్న నాయకులున్నారు. వాళ్ళలో చీలిక వస్తే మనకిక తిరుగులేదు. గాంధీ ప్రాముఖ్యత, నాయకత్వం నీరుగారిపోతాయి. ఉద్యమం చప్పబడిపోతుంది. ఆ చీలిక తీసుకు రావడం మన ప్రధాన కర్తవ్యం.

"మనం జ్యోతిష్కులం కాదు రాడ్నీ ఎప్పుడేమి జరుగుతుందో ఎలా జరగాలో చెప్పడానికి. మన డ్యూటీ మనం చేస్తే అది మేలు చేస్తుందని నేననుకుంటున్నాను."

షిప్ సైరన్ కూసింది. ఇది లాస్ట్ విజిల్.

"గుడ్ బై ఫ్రెండ్స్ అల్ ది బెస్ట్" టెరెన్స్ ఫోస్టర్ ఇద్దరు మిత్రులతో కరచాలనం చేశాడు.

హోల్డెన్ కళ్ళల్లో కన్నీటి పొరలు సుడుల్లా తిరిగాయి.

"గాడ్ బ్లెస్‌యు హోల్డెన్" అంటూ గాంగ్ ప్లాంక్ ఎక్కి షిప్ మీదకు వెళ్ళారు. ఫోస్టర్ పైనుండి వీడికోలుగా చేయి వూపుతుండగా షిప్ కదిలింది.

తన కాబిన్‌లోనికి వెళ్ళి కుర్చీలో కూర్చుని పోర్ట్ హోల్లోనుండి బయటకు చూశాడు ఫోస్టర్. సూర్యకాంతి నీటి మీద ప్రతిఫలిస్తూ వెండి ముక్కలు వెదజల్లినట్లుగా మెరుస్తున్నది.

సూట్‌కేస్ తెరిచి ఓ ఉత్తరాల కట్ట తీశాడు. అవి లవెండర్ వాసనలు వెదజల్లుతున్నాయి. ఆ కట్టవంక ఓ క్షణం చూసి పోర్ట్ హోల్ నుండి సముద్రంలోనికి విసిరేశాడు. 'గుడ్ బై మేరియన్' అనుకున్నాడు.

అప్పుడు అతడు ఓ పుస్తకం తెరిచాడు. అది అతడి డైరీ. యాదృచ్ఛికంగా ఓ పేజీ తెరుచుకుంది. దాదాపు ఓ శతాబ్దంనాడు సర్ థామస్ మన్రో మద్రాస్ గవర్నర్‌గా వున్నప్పుడు అన్న మాటలు రాసి వున్నాయి అక్కడ. ప్రతి బాధ్యతగల ఆంగ్లేయుడి మనసులో ఆ మాటలు ఉలితో గుండెల్లో చెక్కినట్లుగా నిలిచిపోయాయి. ఆ మాటల్లోని సత్యమూ, నిజాయితీ కదిల్చివేస్తాయి.

"మీ పాలన పరదేశీయుల పాలన. అందువల్ల అది ఎన్నిటికీ జనాదరణ పొందజాలదు. మీరు ఈ దేశ ప్రజలకి చేయవలసింది ఎంతో వుంది. మీరు ఎంత చేసినా వారి నుండి స్తబ్దతతో కూడిన కృతజ్ఞతని మించి మీరు ఏమీ ఆశించవద్దు. మీరు ఈ దేశంలో వున్నా ఈ దేశాన్ని ఓ ఇంగ్లాండ్‌గానో, స్కాట్లాండ్‌గానో మార్చాలనే ఉద్దేశ్యంతో కాదు. ఈ దేశపు పద్ధతులు, విధానాలు మీకు నచ్చకపోయినా వాటితోనే పని చేయడానికి ప్రయత్నించండి. వాటి మీద మీకు ఎన్నో అపోహలున్నప్పటికీ సానుభూతితో పనిచేయండి. ఏదో వొకనాడు కాలప్రభావంతో ఈ ప్రజలే పరిపూర్ణతను చెంది తమ ప్రభుత్వాన్ని సమకూర్చుకుని తామే నడుపుకోగల రోజే వస్తే ఆనాడు మీరు ఈ దేశం నుండి వెళ్ళిపొండి. గెట్ అవుట్! మీతో పాటు మీరు సాధించిన మహోజ్వల విజయాన్నీ, బాధ్యతతో ప్రవర్తించామన్న గర్వాన్నీ మీ కష్టాలకి ప్రతిఫలంగా తీసుకుని మీ దేశానికి వెళ్ళిపొండి."

ఈ వాక్యాలని మరోసారి చదివి సంతృప్తితో డైరీ చూశాడు ఫోస్టర్.

అతడిలో ప్రశాంతత.

లైటర్‌తో సిగరెట్ వెలిగించాడు.

షిప్ ఇంగ్లండ్ దిశగా పోతున్నది.

*

### హిప్ హిప్ హుర్రే

వాల్ట్ డిస్నీ, ఎర్నెస్ట్ హెమింగ్వే, రాబర్ట్ హిల్లర్, సోమర్ సెట్ మామ్—వీరందరూ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అంబులెన్స్ డ్రైవర్లుగా పనిచేశారు.

— సేకరణ: హిమజారమణ

